
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php
సంపుటి 16 సంచిక 08 విశాఖపట్నం | గురువారం 31 ఆగష్టు 2023 | 8 పేజీలు | వెల : 5.00




## పొత్తు పాలిటిక్స్..

# యమ హాటు గురూ..!

## చంద్రబాబుకి నారాయణ సూచన.. నిప్పులు చెరిగిన బొత్స





అమరావతి : పొత్తు పాలిటిక్స్.. ఏపీలో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఎలక్షన్ నాటికి ఎవరు ఎవరు జతకడతారో తెలియదు కానీ.. ఇప్పుడు మాత్రం ఈ వ్యవహారం సెగలు పుట్టిస్తోంది. ఎవరితోనైనా పొత్తులకు ఆస్కారం ఉంటుంది అంటూ ఢిల్లీలో చంద్రబాబు ఇచ్చిన స్టేట్‌మెంట్‌తో ఏపీలో రాజకీయం మరింత వేడెక్కింది. ఈ క్రమంలో వైపీసీ కౌంటర్ ఎటాక్.. మధ్యలో సీపీఐ నేత నారాయణ వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. బీజేపీ నేతలతో చంద్రబాబు మాటామంతీ.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో మంతనాలు పొత్తులపై చర్చకు దారి తీసింది. రాష్ట్రం బాగుపడాలంటే జగన్‌ను గద్దె దించాలి అన్న చంద్రబాబు వ్యాఖ్యలకు అర్థమేంటి..? ఏపీలో బలంగా ఉన్న వైసీపీని ఓడించాలంటే పొత్తులు తప్పవని చంద్రబాబు సంకేతాలు ఇచ్చినట్లేనన్న చర్చ మొదలైంది. అవసరాన్ని బట్టి, సమయాన్ని బట్టి పొత్తులు ఉంటాయి. ప్రత్యేక హోదా కోసమే ఎన్డీయే నుంచి బయటకు వచ్చా. అంతే తప్ప బీజేపీతో పెద్దగా విభేదాలు లేవు అన్నట్టు చంద్రబాబు ఢిల్లీలో వ్యాఖ్యానించారు. ఇవన్నీ వింటుంటే పొత్తులు తప్పవని, దానిలో భాగంగానే బాబు తన మనసులో మాట ఇలా చెప్పారన్న వాదన వినిపిస్తోంది. ఈ క్రమంలో చంద్రబాబు స్టేట్‌మెంట్‌పై వైసీపీ కౌంటర్ అటాక్ మొదలుపెట్టింది.

**చంద్రబాబుపై బొత్స సత్యనారాయణ ఫైర్..**

టీడీపీ అధినేత చంద్రబాబుపై మంత్రి బొత్స సత్యనారాయణ నిప్పులు చెరిగారు. బీజేపీ గేటు తెరిస్తే దూరుదామని ఢిల్లీలో ఎదురుచూస్తూ.. ఏపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఏడాది ఉగాది తర్వాత టీడీపీ కనుమరుగవడం ఖాయమని బొత్స జోస్యం చెప్పారు. మళ్లీ మళ్లీ నోరు పారేసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎన్నికల ప్రజాక్షేత్ర0లో ఎవరి సత్తా ఏంటో తేలుతుందన్నారు. ఒంటరిగా పోరాటం చేసి ప్రజలను మెప్పిస్తామన్నారు.

**చంద్రబాబు ఇండియాలో చేరాలి..**

చంద్రబాబు వ్యాఖ్యలపై సీపీఐ నేత నారాయణ స్పందించారు. టీడీపీ ఇండియా కూటమిలో చేరాలని సలహా ఇచ్చారు. బీజేపీ కోసం వెంపర్లాడితే నష్టపోయేది చంద్రబాబేనన్నారు. పవన్, వామపక్షాలను కలుపుకుని వెళ్తే విజయం టీడీపీదేనని జోస్యం చెప్పారు నారాయణ. ఏపీ, తెలంగాణలో ప్రస్తుతం నడుస్తున్నవి బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్లేనన్న నారాయణ.. జగన్, కేసీఆర్%ా% ఇద్దరూ బీజేపీతోనే ఉన్నారన్నారు. తెలంగాణలో పొత్తుపై కాంగ్రెస్‌తో చర్చలు జరుగుతున్నాయని.. కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిస్తే కేసీఆర్ ఓటమి ఖాయం అంటూ నారాయణ పేర్కొన్నారు.

## ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చిన

# కర్ణాటక కాంగ్రెస్: రాహుల్‌గాంధీ



మైసూర్ : ప్రజాపాలన ప్రతినిధి: ఈ ఏడాది కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్ధానాన్ని కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఎన్నికల సమయంలో మహిళా ఓటర్లకు ఇచ్చిన హామీలను వరుసగా సిద్ధరామయ్య ప్రభుత్వం అమలుపరుస్తోంది. తాజాగా బుధవారం 'గృహలక్ష్మి' పథకాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మైసూర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మట్లాడుతూ.. 'ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన ఐదు హామీల్లో ఒకటైన 'గృహలక్ష్మి' పథకాన్ని ఈరోజు ప్రారంభించాం. ఈ పథకం కింద బిపిఎల్ కుటుంబాల్లోని మహిళా పెద్దలకు నెలకు రెండు వేల రూపాయల్ని ప్రభుత్వం అందిస్తుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని కోట్లాది మహిళలకు తమ బ్యాంక్ అకౌంట్లలో రెండు వేల రూపాయల్ని ప్రభుత్వం జమ చేసింది. ట్యాబ్‌పై ఒక్క క్లిక్‌తోనే కోట్లాది మంది మహిళల ఖాతాల్లోకి డబ్బులు జమ అయ్యాయి. ప్రతినెలా మహిళల ఖాతాల్లోకి రెండు వేల రూపాయలు జమ అవుతాయి. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ గానీ, నేతలు గానీ ఏదైనా చెబితే.. కచ్చితంగా వాటిని అమలు చేస్తాం' అని అన్నారు. అలాగే ఎన్నికల క్యాంపెయిన్‌లో మహిళలు బస్సు ప్రయాణానికి ఎలాంటి చెల్లింపులు లేకుండా..'శక్తి' పథకాన్ని ప్రారంభిస్తామని చెప్పాం. ఆ హామీని కూడా నెరవేర్చాం అని రాహుల్ గాంధీ అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఐదు వాగ్ధానాల్లో నాలుగు హామీలు మహిళలకు సంబంధించినవే. ఎంతో లోతైన ఆలోచనతోనే ఈ హామీల్ని ఇచ్చాం అని రాహుల్ అన్నారు. కాగా, మైసూర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోఫాల్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద మహిళా సంక్షేమ పథకం ఇది. 1.28 కోట్ల కుటుంబ మహిళా పెద్దలకు ఈ పథకం ద్వారా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుంది' అని అన్నారు.

# వచ్చే నెలలో అసెంబ్లీ సమావేశాలు..

### మూడో వారంలో నిర్వహించే అవకాశం




అమరావతి, ఆంధ్రప్రభ:రాష్ట్రంలో వర్షాకాల అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం దాదాపు ఖాయమైంది. సెప్టెంబర్ మూడో వారంలో శాసనసభ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉ ందని తెలుస్తోంది. వినాయక చవితి తర్వాత సమావేశాలు ప్రారంభమయ్యే అవకాశం ఉందంటున్నారు. సెప్టెంబరు రెండోవారంలో సమావేశాలను నిర్వహించాలనే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి.. కానీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మొదటి వారంలో లండన్ పర్యటనకు వెళ్లనున్నారని తెలుస్తోంది. సెప్టెంబరు 2వ తేదీ దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డికి ఇడుపులపాయలోని ఆయన ఘాట్ వద్ద నివాళులర్పించిన అనంరతం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని లండన్‌కు వెళ్లనున్నట్లు తెలుస్తుంది. అందుకే అప్పుడు సాధ్యం కాదని భావిస్తున్నారని తెలుస్తోంది. సీఎం విదేశాల నుంచి వచ్చాక కేబినెట్ సమావేశం నిర్వహించి, అందులో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది అంటున్నారు.

10 నుండి 15 రోజులపాటు నిర్వహణ

ఒకవేళ అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తే 10 నుంచి 15 రోజుల పాటూ నిర్వహించాలని భావిస్తున్నారని తెలుస్తోంది. అయితే అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, షెడ్యూల్‌పై క్లారిటీ రావాల్సి ఉంది. సెప్టెంబర్‌లో సమావేశాలు ఖాయమని.. కాకపోతే నాలుగైదు రోజులు అటూ ఇటుగా ఉంటాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అంతేకాదు అసెంబ్లీ సమావేశాలకు ముందు ఏర్పాటు చేసే మంత్రివర్గ సమావేశంలో సభలో ప్రవేశపెట్టాల్సిన బిల్లులపైనా చర్చిస్తారు. ఈ సమావేశాల్లో మూడు రాజధానులకు సంబంధించిన బిల్లు తీసుకోస్తారా అనేది చూడాల్సి ఉంది.

## రాష్ట్ర ప్రభుత్వానికి, టిటిడికి

# హైకోర్టు నోటీసులు




అమరావతి: తిరుమల నడక మార్గంలో ఇనుప కంచె ఏర్పాటు అంశంపై దాఖలైన పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో విచారణ జరిగింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, టిటిడికి ఉన్నత న్యాయస్థానం నోటీసులు జారీచేసింది. చిరుత దాడిలో మృతిచెందిన ఆరేళ్ల బాలిక లక్షిత కుటుంబానికి ఇప్పటికే రూ.15లక్షల పరిహారం ఇచ్చామని టిటిడి, రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది తెలపగా.. మరో రూ.15లక్షలు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

## బాలికల చేత రాఖీలు

## కట్టించుకున్న మోడీ



న్యూఢిల్లీ : రాఖీ పండుగను ప్రధాని నరేంద్రమోడీ ఓ స్కూల్లోని బాలికల మధ్య ఘనంగా జరుపుకున్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఓ స్కూల్ విద్యార్థినీలు రాఖీ పండుగ సందర్భంగా మోడీకి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా చిన్నారుల పేర్లను, ఏ తరగతి చదువుతున్నారో మోడీ వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలికలు, టీచర్స్‌తో కలిసి మోడీ గ్రూప్ ఫొటో దిగారు. కాగా, బుధవారం రాఖీ పండుగ సందర్భంగా జమ్మూకాశ్మీర్‌లోని ఉదమ్‌పూర్ జిల్లాలో పాఠశాల విద్యార్థినులు సిఆర్‌పిఎఫ్ జవాన్లకు రాఖీలు కట్టారు. అలాగే లోయలోని సాంబా జిల్లాలో బిఎస్ఎఫ్ జవాన్లు పాఠశాల విద్యార్థులతో కలిసి రక్షా బంధన్ జరుపుకున్నారు.

# జీ 20 అతిథుల కోసం భారీ ఏర్పాట్లు




న్యూఢిల్లీ : సెప్టెంబర్ 9వ తేదీ నుంచి రెండు రోజులపాటు దేశరాజధాని ఢిల్లీలో జరగనున్న జీ 20 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనే అతిథుల కోసం అధికారులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే దేశరాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్) పరిధిలోని దాదాపు 30 హొటళ్లను వీరి ఆతిథ్యం కోసం బుక్ చేశారు. ఢిల్లీలోని ఐటీసీ మౌర్యా, తాజ్ మాన్‌సింగ్, తాజ్ ప్యాలెస్, హౌటల్ ఒబెరారు, హౌటల్ లలిత్, ది లోధీ, మెరిడీయన్, హయత్ రీజెన్సీ, షంగ్రి లా, లీలా ప్యాలెస్, హౌటల్ అశోక, ఎరోస్ హౌటల్, ది సూర్యా, రాడిసన్ బ్లూ ప్లాజా, జేడబ్ల్యూ మారియట్, ది లీలా యాంబియన్స్ కన్వెన్షన్, ది ఇంపీరియల్ తదితర హౌటళ్లు ఉన్నాయి. ఇక ఎన్‌సీఆర్ పరిధిలోని వివంత, ఐటీసీ గ్రాండ్, తాజ్ సిటీ సెంటర్ హయత్ రీజెన్సీ (గురుగ్రామ్) ది ఒబెరారు తదితర హౌటళ్లున్నాయి. ఐటీసీ మౌర్యాలో బైడెన్ బస ప్రభుత్వ అధికారుల సమాచారం ప్రకారం ఐటీసీ మౌర్యాలో అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ బస చేయనున్నారు. ఇక్కడ అన్ని ఫ్లోర్లు అమెరికా సీక్రెట్ సర్వీస్ కమాండోల ఆధీనంలోకి వెళ్లనున్నాయి. ఈ హౌటల్ 14 వ అంతస్తులో బైడెన్ బస చేసే గది ఉంది. ఆ ఫ్లోర్ చేరడానికి ప్రత్యేకంగా లిఫ్ట్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం ఈ హౌటల్లో 400 గదులను అతిథుల కోసం బుక్ చేశారు. ఇక హౌటల్ షంగ్రి-లాలో బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, క్లారిడ్జెస్‌లో ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, ఇంపీరియల్ హౌటల్‌లో ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్ ఆతిథ్యం స్వీకరించనున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సదస్సుకు హాజరైతే తాజ్ ప్యాలెస్‌లో ఆయనకు విడిది ఏర్పాటు చేశారు. ఇదే హౌటల్‌లో బ్రెజిల్ నుంచి వచ్చే అతిథులు కూడా ఉంటారు. ఒబెరారు హౌటల్లో తుర్కియే దౌత్య బృందాలు బసచేయనున్నాయి. మారిషస్, నెదర్లాండ్స్, నైజీరియా, స్పెయిన్ బృందాలు లా మెరిడియన్ హౌటల్‌లో ఉండనున్నాయి.



## గన్నవరం పూర్తి... ఇక గుడివాడపై గురి




విజయవాడ, ఆగష్టు 30,:వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ఎలాగైనా అధికారంలోకి రావాలని తెలుగుదేశం పార్టీ తహతహలాడుతుంది. ఎన్నికలకు మరో 8 నెలలు సమయం ఉన్నప్పటికీ.. నిత్యం ఏదో ఒక కార్యక్రమాలతో ప్రజల్లోనే ఉంటున్నారు ఆ పార్టీ అధినేత చంద్రబాబు.. ఆయనతో పాటు లోకేష్ యువగళం పాదయాత్రతో ప్రజల్లోనే ఉన్నారు. ఇక టీడీపీ కేడర్‌ను మొత్తం ఎన్నికలయ్యే వరకూ ప్రజల మధ్యలోనే ఉంచేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు చంద్రబాబు.. బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి, ప్రాజెక్టుల యాత్ర పేరుతో కార్యక్రమాలు నిర్వహించిన తెలుగుదేశం పార్టీ.. తాజాగా బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో ప్రజల్లోకి వెళ్తుంది. ఓవైపు కార్యక్రమాలు నిర్వహిస్తూనే మరో వైపు నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితి, స్థానిక నాయకల అభిప్రాయాలు తీసుకోవడం, అభ్యర్థులు, ఇన్‌ఛార్జీల ఎంపికపై చంద్రబాబు దృష్టి పెట్టారు. రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీట్లలో కృష్ణా జిల్లాలోని గన్నవరం, గుడివాడ సీట్లు ఎంతో కీలకమైనవి. గన్నవరం నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన వల్లభనేని వంశీ, గుడివాడలో ఒకప్పుడు టీడీపీ నుంచి గెలిచిన కొడాలి నానిని ఓడించాలనేది చంద్రబాబు టార్గెట్.. అందుకే ఈ రెండు స్థానాల్లో ఎలాగైనా పాగా వేయాలని గట్టి పట్టుదలతో ఉన్నారు. అయితే వంశీ, కొడాలి నానిని ఓడించడానికి ప్రజాబలం, ధనబలం ఉన్న నాయకులు కావాలి.. ఇటీవల గన్నవరం నియోజకవర్గానికి యార్లగడ్డ వెంకట్రావును ఇంచార్జిగా ప్రకటించిన టీడీపీ.. వచ్చే ఎన్నికల్లో ఆయన్నే బరిలో దించనుంది. మరి గుడివాడలో ఎవరిని పోటీలోకి దించాలనే దానిపై టీడీపీలో చర్చ జరుగుతుంది.కృష్ణా జిల్లాలో గన్నవరం సీటు యార్లగడ్డ వెంకట్రావుకు దాదాపు కన్‌ఫార్మ్ అయిపోయింది. మరి గుడివాడలో ఎవరిని దించుతారనే చర్చ జరుగుతుంది. గుడివాడలో ఎమ్మెల్యే కొడాలి నాని వరుసగా నాలుగోసారి ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారు. మొదట రెండు పర్యాయాలు తెలుగుదేశం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత 20014, 2019లో వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. చంద్రబాబు అంటే ఒంటి కాలిమీద లేస్తారు కొడాలి నాని. అందుకే నానిని కూడా ఎలాగైనా ఓడించాలనేది చంద్రబాబు లక్ష్యం.. కానీ అదంత ఆషామాషీ కాదు.. నానికి అన్ని రకాలుగా సమఉజ్జీని తీసుకురావాలని చంద్రబాబు ఆలోచిస్తున్నారు. ప్రస్తుతం గుడివాడ టీడీపీ ఇంచార్జిగా రావి వెంకటేశ్వరరావు ఉన్నారు. ఈయనతో పాటు గుడివాడలో తెలుగుదేశం పార్టీ టిక్కెట్ ఆశిస్తూ ప్రజల్లోనే ఉంటున్న వెనిగండ్ల రాము కూడా పోటీలో ఉన్నారు. అయితే రావి వెంకటేశ్వరరావు, వెనిగండ్ల రాములో ఎవరో ఒకరికి టిక్కెట్ ఇవ్వడం ద్వారా గెలుపోటములు ఎలా ఉంటాయని చంద్రబాబు లెక్కలు వేస్తున్నారు. నానిని ఢీకొట్టాలంటే సామాజిక సమీకరణాలతో పాటు అంగబలం, ఆర్థికబలం కూడా ఉండాలి. ప్రస్తుతం నియోజకవర్గంలో టీడీపీలో యాక్టివ్ గా ఉన్న వెనిగండ్ల రాముకు టిక్కెట్ ఇస్తే అన్ని సమీకరణాలు కలిసొస్తాయని పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే, రాము కంటే ఇంకా బలమైన నాయకుడు ఎవరు ఉన్నారు అనే దానిపై చంద్రబాబు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. అన్నీ అనుకూలిస్తే వెనిగండ్ల రాముకు టిక్కెట్ ఇవ్వొచ్చంటున్నారు పార్టీలోని సీనియర్ నేతలు.గుడివాడ నియోజకవర్గంలో కొడాలి నాని వరుసగా నాలుగుసార్లు గెలవడం వెనుక సొంత ఇమేజ్ కూడా చాలా వరకూ పనిచేసింది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు గుడివాడ టీడీపీకి కంచుకోట. కానీ కొడాలి నాని టీడీపీ నుంచి వైసీపీలోకి చేరిన తర్వాత ఆ కంచుకోట కాస్తా వైసీపీకి ఫేవర్‌గా మారిపోయింది. ఇక్కడ పార్టీకి తిరిగి పాత వైభవం తీసుకొచ్చేందుకు చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కొడాలి నానికి మాస్ లీడర్‌గా ఇక్కడి ప్రజల్లో ఆదరణ ఉంది. దానికి తోడు ఫ్యాన్ గాలి కూడా బలంగా వీయడం కొడాలికి కలిసొచ్చే అంశం. అయితే ఇటీవల గుడివాడ అభివృద్ధిపై కొడాలి నానిపై తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు టీడీపీ నేతలు. దీంతో కొడాలి నానికి కాస్త వ్యతిరేకత ఉందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ నుంచి వెనిగండ్ల రాముకు టిక్కెట్ ఇస్తే కమ్మ, ఎస్సీ సామాజిక వర్గాల నుంచి బలమైన ఓటు బ్యాంకు అనుకూలంగా ఉంటుందని లెక్కలు వేస్తున్నారు. ఇప్పటికే సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఉంటున్న వెనిగండ్ల రాము ఎన్నారై కావడంతో అన్ని విధాలుగా కొడాలి నానిని ఢీకొట్టగలడని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే గుడివాడ విషయంలో ఎలాంటి ఏమరుపాటుకు గురికాకుండా పక్కా లెక్కలతో దిగాలనుకుంటున్నారు చంద్రబాబు. అభ్యర్థి విషయంలో కాస్త ఆలస్యమైనా గెలుపు గుర్రానికే టిక్కెట్ ఇవ్వాలనే ఆలోచనతో ఉన్నారు. మరి గుడివాడ టీడీపీ బరిలో ఎవరు ఫైనల్ అవుతారనేది ఎన్నికల సమరం వరకు వేచిచూడాల్సిందే.

## ఇక ఈజీగా రిజిస్ట్రేషన్

విజయవాడ, ఆగష్టు 30, :ఆంధ్రప్రదేశ్‌లో ఈనెల 31 నుంచి అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కొత్త సాఫ్ట్‌వేర్‌ను అమల్లోకి తెస్తోంది ఏపీ ప్రభుత్వం. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా వినియోగదారుల సమయం వృథా అవ్వదు అంటున్నారు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రామకృష్ణ. "కార్డ్ ప్రైమ్" సాఫ్ట్‌వేర్ ద్వారా నేరుగా రిజిస్ట్రేషన్‌కు డిజిటల్ సైన్ ద్వారా అప్లయ్ చేస్తే.. నేరుగా డాక్యుమెంట్‌ను మెయిల్ చేస్తామంటున్నారు. ఈ నెల 15 లోపు అన్ని చోట్లా అమల్లోకి తెస్తామన్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖను రాష్ట్ర ప్రభుత్వం టెక్నాలజీ వైపుకు నడిపిస్తోంది. కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషణ్ డిపార్ట్‌మెంట్ (కార్డ్)ను ఆధునీకరించి కార్డ్ 2.0కు రూపకల్పన చేస్తోంది ప్రభుత్వం. దీని ద్వారా స్టాంపు పేపర్లు, సంతకాలతో పనిలేకుండా సులువుగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. కేవలం బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర వేయడానికి 5 నుంచి 10 నిమిషాలు వుంటే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బయట జరిగే పనిని సులభంగా ఆన్‌లైన్లోనే చేసుకోవచ్చు. దీనిని పబ్లిక్ డేటా ఎంట్రీ ఇంటిగ్రేషన్ అంటారు.

## 2024 ఎన్నికలలో వైసీపీకి 175 కి 175 సీట్లు రావడం ఖాయం

**ఆత్మవిశ్వాసాన్ని వెలిబుచ్చిన వైసీపీ చీరాల నియోజకవర్గ ఇ న్చార్జి కరణం వెంకటేష్ బాబు**



చీరాల, ఆగష్టు 30, ప్రజాపాలన : ప్రజా సంక్షేమ పాలన అందజేస్తున్న వైసీపీకి 2024 ఎన్నికలలో, 175 కి 175 సీట్లు ఖాయ మన్న ఆత్మవిశ్వాసాన్ని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చీరాల నియోజకవర్గ ఇంచార్జీ కరణం వెంకటేష్ వెలిబుచ్చారు. చీరాల మండలం ఈపురుపాలెం-4 గ్రామ సచివాలయం, బోయిన వారిపాలెం పరిధిలో జరిగిన, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైసిపి చీరాల ఇంచార్జీ కరణం వెంకటేష్ పాల్గొన్నారు. ప్రజలతో మమేకమై అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో ఆరా తీశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఉన్న కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి ఇంచార్జ్ వెంకటేష్ మాట్లాడుతూ, ఏ రాష్ట్రంలో కనీ వినీ ఎరుగని రీతిలో, ఆర్థిక సంక్షోభంలో ఉన్నా కూడా, ప్రజా సంక్షేమ పథకాలను నిరంతరం అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నా రు. జగన్‌పాలన పట్ల, ప్రజలలో కనిపిస్తున్న, విశేషమైన సానుకూలస్పందన, రాబోయే ఎన్నికలలో వైసిపి 175 కి, 175 సీట్లలో అత్యధిక మెజార్టీ తో గెలుస్తుందనడానికి నిదర్శన మన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, ఆర్ బి కె చైర్మన్ కావూరి రమణా రెడ్డి, పి.ఎ.సి.ఎస్.అధ్యక్షులు బోయిన కేశవు లు, యర్రాకుల బాపిరాజు, కోటి రవి, బిట్రా శ్రీను, చప్పిడి వెంక టేశ్వర్లు, జంగిలి ఏసు, నక్కల యానాది, చప్పిడి రామచంద్ర యాదవ్, యర్రాకుల శ్రీను, బోయిన కృష్ణ, ఆసోది అంకాళ రెడ్డి, పృథ్వి ధనుంజయ, చావలి వాసు, పెరుగు ఏడుకొండలు, జగదీష్, శ్రీను, ముద్దు కృష్ణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, డిఆర్డిఎ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## ప్రజా సమస్యల పరిష్కారంలో చీరాల మున్సిపల్ పాలకులు విఫలం.- సీపీఎం పట్టణ కమి టీ విమర్శ.



చీరాల, ఆగష్టు 30, ప్రజాపాలన : చీరాల పట్టణంలో ప్రజలు ఎదు ర్కొనే మౌలిక సమస్యలను పరిష్కరించడంలో, చీరాల మున్సిపల్ పాలక వర్గం విఫలమైందని, సిపిఎం పార్టీ చీరాల పట్టణ కమిటీ కార్యదర్శి నలతోటి బాబూరావు విమర్శించారు. పేరాల లోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చీరాల పట్టణంలో ఎన్నికైన 33 మంది వార్డు కౌన్సిలర్లు, ప్రజా సమస్యలను పరిష్క రించటం మానేసి, ఎమ్మెల్యే, వైసీపీ ఇన్చార్జిల సేవలో తరిస్తున్నారన్నారు. ఎంతో కాలంగా చీరాల పట్ట ణంలో ప్రధాన సమస్య అయిన డ్రైనేజీ కి, డ్రైనేజీ కాలువల నిర్మాణం కోసం,వందల కోట్లు ఖర్చు పెట్టినప్పటికీ, సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నా రు. ప్రతి సంవత్సరం వర్షాకా లంలో ప్రజలు డెంగ్యూ బారిన, విష జ్వరాల బారిన పడుతున్నారన్నారు. సిపిఎం పార్టీ చూపించే పరిష్కార మార్గం ప్రకారం, చీరాల డ్రైనేజీ సమస్య పరిష్కారానికి, కుందేరు కాలువని అభివృద్ధి చేసి, పట్టణంలో డ్రైనేజీ కాలువలు, మొత్తాన్ని కుందేరు డ్రైన్ కి అనుసంధానం చేయడం ద్వారా, కుందేరుకు పారుదల సౌకర్యాలు కల్పించడం ద్వారా, డ్రైనేజీ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంపుదల చేయక పోవడంతో అంతే, పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. ఎంతో కాలంగా నివాసస్థలాల కోసం, అర్జీలు పెట్టుకు న్న ప్రజలకి, ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో పాలక వర్గం విఫలమైందన్నారు. కుందేరు అభివృద్ధి, ఆధునీకీకరణ కి నిధులు రాబట్టలేక పోయార న్నారు. కుందేరుని కొంతమంది దురాక్రమణదారులు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నా, కుందేరు ని కాపాడడంలో, పాలక వర్గం విఫలమైందన్నారు. పట్టణంలో నడిబొడ్డున మునిసిపల్ ఆస్తిని కబ్జా చేసి, కొందరు ప్రవేటు కట్టడాలు నిర్మిస్తే, వారిపై ఎలాంటి చర్యలు తీసు కోలేదన్నారు.మునిసి పల్ నిధులతో నిర్మిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహ నిర్మాణవిషయంలో, పట్టణంలో ఇతరపార్టీలు ప్రజాసంఘాలు, అంబేద్కర్ వాదుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవడం, పాలక వర్గ ఒంటెద్దు పోకడ కి నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా పాలకవర్గం భేషజాలు మాని, పట్టణ ప్రజా సమస్యల పరిష్కారానికి, అవసరమైన నిధులు రాష్ట్రప్రభుత్వం నుండి రాబట్టి, ప్రజలకు మౌళిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. సమావేశం లో సిపిఎం చీరాల కమిటీ సభ్యులు ఎమ్.వసంతరావు, ఎల్.జయరాజు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష మొక్కల నర్సరీ నిర్వహణ అత్యద్భుతం

**నార్వే దేశ ప్రతినిధి, ఫ్రిపేర్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జాకబ్ ధర్మరాజ్**



వేటపాలెం, ఆగష్టు 30, ప్రజాపాలన : లక్ష మొక్కల నర్సరీ నిర్వహణ అత్యద్భుతమని, ప్రొటెక్ట్ సంస్థ కార్యదర్శి శవనం చంద్రారెడ్డి పర్యవే క్షణా తీరు ప్రశంసనీయమని, నార్వే దేశ ప్రతినిధి, ఫ్రిపేర్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్.జాకబ్ ధర్మరాజ్ అభినందించారు. వేటపాలెం మండలం, అక్కా యిపాలెం పంచాయతీ పరిధి లోని, లక్ష్మీపురంలో ఉన్న జీవ వైవిద్య మండలి, లక్షమొక్కల నర్సరీని వర్మీ కంపోస్ట్ ని, సేంద్రి య ఎరువుల విధానాన్ని పరిశీలించారు. భూ సారాన్ని పెంపొందించుకునే దిశగా, సేం ద్రియ వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలని, రైతులకు డాక్టర్ జాకబ్ పిలుపునిచ్చారు. ప్రొటెక్ట్ సంస్థ నిర్వహిస్తున్న వర్మీ కంపోస్టు యూనిట్, వర్మి వాష్ యూనిట్, భూసారాన్ని పెంచే ఏరు వాక మొక్కల గురించి క్షుణంగా పరిశీలించారు. రైతులకు పై అంశాలపై శిక్షణ ఇవ్వాలని ఫ్రిపేర్ సంస్థ ఆధ్వర్యంలో, సుస్థిర వ్యవసాయం పై, త్వరలో శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.అక్కాయిపాలెం లో రవిచంద్ర రైతు పండిస్తున్న, బీరకాయ సాగును పరిశీలించి, సేంద్రి య,జీవన ఎరువుల గురించి వివరించారు.కార్యక్రమంలో ఫ్రిపేర్ ఏపీ లీడ్ కోఆర్డినేటర్ బ్రింద, కోఆర్డినేటర్ ఎస్ఎస్వి రమణారెడ్డి, ఎం. వెం కటేశ్వర్లు, ప్రొటెక్ట్‌సంస్థ కార్యదర్శి ఎస్ చంద్రారెడ్డి, కార్యకర్తలు మయూరి, సిబ్బంది నాగూర్, దయామణి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ-బీజేపీ-జనసేన పార్టీల పొత్తు..?

విజయవాడ, ఆగష్టు 30, :ఒకరేమో కేంద్రంలోని అధికారపార్టీకి జాతీయ అధ్యక్షుడు.. మరొకరు అదే పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలు.. ఇంకొకరేమో ఏపీలోని ప్రతిపక్ష పార్టీకి అధినేత.. వెళ్లింది ఒక పని మీద.. కానీ, అక్కడ మరో ఆసక్తికర విషయం చోటుచేసుకుంది. వీరంతా సపరేటుగా భేటీ కావడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో దుమ్ముదుమారం రేపుతోంది. ఎన్టీఆర్ 100 స్మారక నాణెం విడుదల సందర్భంగా ఢిల్లీకి వెళ్లిన చంద్రబాబునాయుడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో చర్చలు జరిపారు. ఈ చర్చల్లో ఏపీ బీజేపీ చీఫ్ పురంధేశ్వరి కూడా ఉండటం ఏపీ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఒకపని మీద అయితే, అక్కడ మరొకటి చోటుచేసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా వీరి కలయిక వెనుక ప్రధాన కారణం.. వచ్చే ఎన్నికల్లో పొత్తు కోసమేనా అనే చర్చ జరుగుతోంది.2019 ఎన్నికలకు ముందు టీడీపీ–బీజేపీల మధ్య గ్యాప్ మొదలైంది. ఎన్నికల నాటికి అది మరింత ముదిరి ఎవరికి వారే అన్నట్టు తయారయ్యింది. 2019 ఎన్నికల ఫలితాల్లో టీడీపీ దారుణ ఓటమికి గురికావడంతో కొన్నాళ్ల పాటు వారి బంధం సైలెంట్ అయిపోయింది. ఆ తరువాత మారిన పరిణామాల దృష్ట్యా ఏపీలో తిరిగి పట్టు సాధించేందుకు అటు బీజేపీ ఇటు జనసేన పార్టీలతో కలిసి నడిచేందుకు చంద్రబాబు ప్లాన్లు వెయ్యడం మొదలెట్టారు. 2024 ఎన్నికలు దగ్గర పడే కొద్దీ అవి ఒక్కొక్కటిగా అమలు చెయ్యడం స్టార్ట్ చేశారు. జనసేన విషయంలో ఇప్పటికే చంద్రబాబు అవి దాదాపు వర్కౌట్ అయినట్టే కనిపిస్తున్నాయి. ఇటు బీజేపీతో కూడా కలసినడిచేందుకు ప్రయత్నాలు అన్ని రకాలుగా సాగుతూ వస్తున్నాయి. అందులో భాగంగా గతంలోనూ అమిత్ షాను, జేపీ నడ్డాను కలిశారు. ఆ తర్వాత నుంచి రెండు పార్టీల మధ్య బంధం క్రమంగా బలపడుతున్నట్టు కనిపిస్తూ వచ్చింది. తాజాగా రాష్ట్రపతి భవన్ వేదికగా ఎన్టీఆర్ 100 స్మారక నాణెం విడుదల కార్యక్రమంలో చంద్రబాబు– జేపీ నడ్డా, పురంధేశ్వరి మధ్య జరిగిన భేటీతో ఇక రెండు పార్టీల మధ్య స్నేహం పూర్తిగా స్థాయిలో చిగురించినట్టేననని.. దాన్ని అధికారికంగా ప్రకటించి చేతులు కలపడమే తరువాయన్న విశ్లేషణలు ఏపీ రాజకీయాల్లో వెల్లువెత్తుతున్నాయి.మరోవైపు తాజా పరిణామాలపై వైసీపీ ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరిపై డైరక్ట్ ఎటాక్ స్టార్ట్ చేసింది. అయితే ఈ ఏటాక్ వెనుక కూడా కారణం లేకపోలేదు. నిజానికి కొన్ని నెలల క్రితం శ్రీకాళహస్తిలో జేపీ నడ్డా సభతో వైసీపీపై మొదలైన ఎదురుదాడి విశాఖలోని అమిత్ షా సభతో పతాక స్థాయికి చేరింది. ఆ తర్వాత నుంచి ఢిల్లీలో అన్ని విషయాల్లోనూ బీజేపీకీ వైసీపీ మద్దతిస్తూ వస్తున్నప్పటికీ ఏపీలో మాత్రం రెండు పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా పురంధేశ్వరి వచ్చిన తర్వాత ఈ గొడవ ముదురు పాకాన పడింది. ఓ దశలో పురంధేశ్వరి బీజేపీ అధ్యక్షురాలిగా కాకుండా టీడీపీ ప్రతినిధిగా మాట్లాడుతున్నారంటూ వైసీపీ నేతలు మండిపడుతూ వచ్చారు. తాజాగా వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కూడా తన ట్వీట్లో పురంధేశ్వరిని కూడా ప్రధానంగా టార్గెట్ చేశారు. ఓ దశలో టీడీపీ–బీజేపీ–జనసేన కలిసి వెళ్తే వైసీపీకి వచ్చిన నష్టమేంటని ప్రశ్నించారు బీజేపీ ఎంపీ సుజనా చౌదరి. మొత్తంగా చూస్తుంటే? ప్రస్తుతానికి ఏపీలో టీడీపీ–బీజేపీ–జనసేన పార్టీల పొత్తు విషయంలో మూడు పార్టీలు దాదాపు ఒక క్లారిటీకి వచ్చినట్టే కనిపిస్తోంది. అయితే అధికారికంగా ఎప్పుడు ప్రకటిస్తారన్నది మాత్రం ప్రస్తుతానికి క్వశ్చన్ మార్కే. బహుశా త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ఈ విషయంలో పూర్తి క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అప్పటి వరకు అటు వైసీపీ–ఇటు టీడీపీ–బీజేపీ–జనసేన పార్టీల మధ్య ఈ పొత్తు పంచాయతీలు కంటిన్యూ అవుతునే ఉంటాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

## నెల్లూరులో అతి ఎత్తైన రైల్వే బ్రిడ్జి

నెల్లూరు, ఆగష్టు 30,:శంలోనే అతి పొడవైన రైల్వే వంతెన కేరళలోని వెంబనాడ్ వద్ద ఉంది. ఇపుడు అంతకన్నా పెద్దది అనడం కన్నా ఎత్తైన, భిన్నమైన రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయింది. ఇంతకు ఆ వంతెన ఎక్కడ ఉంది.. దాని ప్రత్యేకత ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. దేశంలో అత్యంత ఎత్తైన కొండ ప్రాంతాల్లోనూ, నదులపైన రైల్వే వంతెనలు చాలానే ఉన్నాయి. అతి పొడవైన వంతెన కేరళలోని కొచ్చి ప్రాంతంలో ఉంది. సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ వంతెన నీటి సరస్సుపై ఉంటుంది. కానీ అంత పొడవు కాకున్నా మరో పెద్ద వంతెన.. అది కూడా భిన్నమైన వంతెన.. ఇప్పుడు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అదే ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లాలోని గూడూరు, నెల్లూరు జిల్లాలోని మనుబోలు రైల్వేస్టేషన్ల మధ్య నూతనంగా నిర్మించిన 2.2 కిలోమీటర్ల రైల్వే ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చింది. అది కూడా కింద రైల్వే లైన్.. ఫ్లయ్ ఓవర్?పై కూడా రైల్వే ట్రాక్.. అలా అని వేర్వేరు మార్గం కూడా కాదు. విజయవాడ చెన్నై వెళ్లే మార్గమే. గూడూరు ? మనుబోలు మధ్య నిర్మించిన రైల్ ఓవర్ రైల్ (ఆర్వోఆర్) జోన్ లోనే అతి పొడవైనదిగా గుర్తింపు పొందినట్టు రైల్వే అధికారులు తెలిపారు. రెండేళ్లలోనే ఆర్వోఆర్ పనులు పూర్తిచేసిన రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ అధికారులు తక్కువ సమయంలోనే ఈ నిర్మాణ పనులను పూర్తి చేశారు. విజయవాడ–గూడురు మధ్య మూడో లైను పనులు కోసం దక్షిణ మధ్య రైల్వే రూ.3,240 కోట్లు మంజూరు చేసిందని, ఇందులో భాగంగా ఈ బ్రిడ్జిని నిర్మించినట్లు చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 32.5 టన్నుల యాక్సిల్ లోడుతో రైళ్లు సజావుగా నడిపేలా వంతెన నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. గూడురు రైల్వే జంక్షన్ పరిధిలో అత్యధికంగా రైళ్ల రాకపోకలు సాగుతున్న నేపథ్యంలో ఫ్లైఓవర్ ఎంతగానో ఉపయోగపడుతుందని జీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.అయితే ఈ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో విజయవాడ– రేణిగుంట, చెన్నై–విజయవాడ మధ్య ఎలాంటి అంతరాయం లేకుండా రైళ్ల రాకపోకలు సాగుతాయని.. ఈ మార్గంలో రైళ్ల సగటు వేగం కూడా మెరుగవుతుందని రైల్వే అధికారులు అంటున్నారు. ఇక మరో ప్రయోజనం కూడా ఈ భారీ వంతెన వల్ల ఉంది. అదే విజయవాడ నుంచి గూడూరు మీదుగా వెళ్లే రైళ్ల ట్రాఫిక్ సమస్య లేకుండా ఉండనుంది. కొత్తగా నిర్మించిన ఈ వంతెన గూడూరు వరకు ఎడమ వైపు ఉండగా.. ఇక్కడ రైల్వే ట్రాక్ పై నుంచే కుడి వైపుకు వెళుతుంది. దీంతో తిరుపతి రైళ్లకు ఆలస్యం లేకుండా ఉంటుంది.

## మాజీ ఎమ్మెల్యే రావి హౌస్ అరెస్టు



గుడివాడ : విజయవాడ ఇబ్రహీంపట్నంలో డిజియం కార్యాలయం వద్ద టిడిపి అధ్వర్యంలో ఇసుక మైనింగ్‌పై జరిగే నిరసనకు వెళ్ళాకుండ ముందుస్తు చర్యలో భాగంగా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావును బుధవారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేస్తున్న అక్రమ ఇసుక మైనింగ్ ఫిర్యాదు చేయడానికి తెలుగుదేశం పార్టీ పిలుపునివ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఆక్రమంలు బయట పడతాయనే ముందుస్తుగా అరెస్టులు చేయడం జరిగిందన్నారు.

**పిన్నమనేని బాబ్జి హౌస్ అరెస్ట్**

టిడిపి నాయకుడు అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య (బాబ్జీ)ని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

## నూజివీడు బాయ్స్ హై స్కూల్ కు స్పోర్ట్స్ లో ఎక్స్ లెన్స్ అవార్డు



నూజివీడు, ఆగస్టు 30, ప్రజాపాలన ప్రతినిధి:నూజివీడు పట్టణంలోని బాయ్స్ హైస్కూలు విద్యార్థులు వరుసగా రెండవసారి జిల్లా స్థాయిలో స్పోర్ట్స్ నందు ఎక్సలెన్స్ అవార్డు కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ భాగవతుల హేమలత తెలిపారు. పాఠశాలలో ఆమె బుధవారం మాట్లాడుతూ విద్యార్థులలో క్రీడల పట్ల ఉన్న ఆసక్తిని గ్రహించిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్నో మెలకువలు నేర్పుతూ, శిక్షణ ఇవ్వడంతో పాటు విద్యార్థుల అభిప్రాంత కృషితో స్పోర్ట్స్ నందు ఎక్సలెన్స్ అవార్డు లభించినట్లు తెలిపారు. కృష్ణాజిల్లాలో ఉండగా ఒకసారి, నేడు కొత్తగా ఏలూరు జిల్లాలోకి అనుసంధానం జరిగిన తర్వాత జిల్లా స్థాయి స్పోర్ట్స్ నందు ఎక్సలెన్స్ అవార్డ్స్ విద్యార్థులు కైవసం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ అందించిన వ్యాయామ ఉపాధ్యాయులను, అవార్డులు కైవసం చేసుకున్న విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు నూజివీడు ఖ్యాతిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నెలపాలని కోరారు. మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు.

## తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు



పల్నాడు జిల్లా. నరసరావుపేట .ఆగస్టు 30 (ప్రజాపాలన ప్రతినిధి.) స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ మరియు వ్యవస్థాపకత అభివృద్ధి సెల్ వారి ఆధ్వర్యంలో సెషన్ ప్యానల్ డిస్కషన్ ఇన్నోవేషన్ మరియు స్టార్టప్ ఎకో సిస్టం ఎనేబుల్ నుండి రీజియన్ స్టేట్ నేషనల్ లెవెల్ అనే అంశం మీద అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎస్పి అన్నమయ్య ఈసీ స్పెషల్ ఆఫీసర్స్ రాజమహేంద్రవరం మున్సిపాలిటీ కార్పొరేషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకుర సంస్థలను ఎలా ప్రారంభించాలి మరియు వాటి నిర్వహణకు అవసరం అయ్యే వనరులను ఎలా సమీకరించుకోవాలి వివరించేనారు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ మాట్లాడుతూ కాలేజీ మేనేజ్మెంట్ విద్యార్థులను పారిశ్రామిక వ్యక్తులుగా తయారు చేయడంలో ఎటువంటి పాత్ర నిర్వహిస్తుందో వివరించినారు ఈ కార్యక్రమంలో ఈ డి సి కన్వీనర్ సిహెచ్ నాగేశ్వరరావు గారు సీనియర్ అత్యాపకులు పిడిఆర్ మూర్తి గారు డాక్టర్ జి అనిల్ గారు మరియు కన్వీనర్ కే సతీష్ గారు పాల్గొన్నారు

## మూడు రకాల ఓట్ల తొలగింపుకు సంబంధించిన రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలి: జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి పి. రాజాబాబు




మచిలీపట్నం కలెక్టరేట్ ఆగస్టు 30 ప్రజా పాలన:భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడు రకాల ఓట్ల తొలగింపుకు సంబంధించిన రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి పి. రాజాబాబు ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఓటరు నమోదు అధికారులు (ఈ ఆర్ ఓ లు),ఏ ఈ ఆర్ ఓ లు, జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఓట్ల తొలగింపు, నూరు శాతం స్థూల నమోదు నిష్పత్తి (జి ఈ ఆర్) తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈఆర్వోలు అందరూ ఇదివరకు మృతి చెందిన, ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉన్నా, శాశ్వతంగా వలస వెళ్లడంతో తొలగించిన మూడు రకాల ఓట్లలో యాదృచ్ఛికంగా 500 కేసులను క్షుణ్ణంగా పరిశీలించి పక్కాగా సంబంధిత రికార్డులను, జాబితాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. భవిష్యత్తులో ఎవరైనా వాటికి సంబంధించి అభ్యంతరం చెబితే ఆయా ఈఆర్వోలు బాధ్యులవుతారని స్పష్టం చేశారు. నిజమైన ఓట్లను ఎట్టి పరిస్థితులను తొలగించరాదని దీనిపై భారతీయ ఎన్నికల సంఘం చాలా కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. తొలగించిన ఓట్లకు సంబంధించిన రికార్డులు తయారు చేయుటకు బూతు స్థాయి అధికారులు 5 రోజులు అడిగినప్పటికీ ఇప్పటికే 10 రోజులు కావలసినంత సమయం ఇవ్వడం జరిగిందన్నారు. ఇక ఎట్టి పరిస్థితుల్లోనూ లోపాలు ఉండరాదని నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత బూత్ సాయి అధికారులను సస్పెండ్ చేయడం గాని చార్జి మెమో జారీ చేయడం గానీ జరుగుతుందని హెచ్చరించారు. ఈఆర్వోలు పరిశీలించిన 500 కేసుల్లో తాను కూడా మరలా పరిశీలిస్తానన్నారు. మచిలీపట్నంలో ముఖ్యంగా అన్ని రికార్డులు పక్కాగా ఉంచుకోవాలని రెండు వందల శాతం పరిశీలన చేయాలన్నారు. జిల్లాలో విద్య వ్యవస్థను పటిష్టం చేయడంలో భాగంగా స్థూల నమోదు నిష్పత్తిని (జి ఈ ఆర్ )నూటికి నూరు శాతం సాధించాలన్నారు. విద్యా, సామాజిక అభివృద్ధి ప్రాధాన్యత అంశాలున్నారుగ్రామ వార్డు సచివాలయాల సంక్షేమ, విద్యా కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించి వారి పరిధిలో గల వాలంటీర్ల ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 5 నుండి 18 సంవత్సరాల వయసు గల పిల్లలందరూ బడిలో గాని కళాశాలలో కానీ చేరి ఉండాలని స్పష్టం చేశారు. వారు రెగ్యులర్ లేదా సార్వత్రిక (ఓపెన్) విద్యాసంస్థల్లో ఏదో ఒకచోట చేరి ఉండాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్లో సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ వెంకటేశ్వర్లు, 7 నియోజకవర్గాల ఈ ఆర్ ఓ లు ఐ కిషోర్, పద్మావతి, శివ నారాయణ రెడ్డి, పార్వతి, రాజ్యలక్ష్మి, చంద్రలీల, శ్రీనివాసరావు, డిఇఓ తహేరా సుల్తానా, డి ఎల్ డి ఓ సుబ్బారావు, తహసిల్దార్లు ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, గ్రామ వార్డు సచివాలయాల సంక్షేమ విద్య కార్యదర్శులు తదితర అధికారులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి మరోకరికి ప్రాణదానం చేయండి: జనసేన ఆర్‌కె




గుడివాడ : అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీ స్త్రీకి రక్తదానం చేసి తల్లి బిడ్డ ప్రాణాలు కాపాడిన జనసైనికుడు అభినందనీయుడని, రక్తదానం చేసి మరోకరి ప్రాణదానం చేయడం ప్రతి ఒక్కరి బాద్యతని గుర్తు పెట్టుకోవాలని జనసేన నాయకుడు డా॥ మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఏరియా అసుపత్రిలో చిన్న ఎరుకుపాడు గ్రామానికి చెందిన మంగమ్మ కుమార్తె తనూజ నిండు గర్భిణి అమెకు రక్త అవసరం అవడంతో ఫోనులో సంప్రదించడం జరిగిందన్నారు. అమె అవసరమైన రక్తని జనసేన నాయకుడు గాదె చరణ్ రక్తదానం చేశారన్నారు. ఈ సందర్బంగా ఆర్‌కె మాట్లాడుతూ రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి అనే నినాదంతో గుడివాడ పట్టణంలో అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడడం జరుగుతుందన్నారు. యువత లేనిపోని అపోహాలు విడనాడి రక్తదానం చేసే ప్రాణాలు కాపాడాలని కోరారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నూనె అయ్యప్ప, చరణ్, తేజ్, నాగసాయి, చరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆనందపురం పాలవాలస గ్రామంలో నేచురల్ ఫార్మింగ్ కూరగాయల మార్కెటింగ్



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి ఆగస్ట్ 30: ఆనందపురం మండలం,పాలవలస గ్రామంలో ఈరోజు 10 మంది కూరగాయల రైతులను అవని ఆర్గనిక్స్ టై అప్ చేయించడం జరిగింది. అలానే కూరగాయలు వేసే ఫీల్డ్ లు చూపించి అక్కడ రైతులు తో మాట్లాడించడం జరిగింది. వారంలో2 రోజులు తర్లువాడ గోడౌన్ కి పంపించడానికి మాట్లాడటం జరిగింది. అవని ఆర్గానిక్ బిందు గారు %చీఖీూ% వనజ,చక్రవర్తి,%అషతీజూం% అట్టెండ్ అవ్వడం జరిగింది.

## రోటరీ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం



చీరాల, ఆగష్టు 30, ప్రజాపాలన : అన్నదానం మహాదానం అనే స్ఫూర్తితో, వేటపాలెం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో, జాండ్రపేట శివాలయం లో మంగళ, శనివారాలు పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా, మంగళవారం 60 మంది పేదలకు, అన్నదాన కార్యక్రమాన్నినిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ సుబేదార్ గౌరాబత్తుని బాబూరావు హాజరయ్యారు. మిలటరీలో 28 సంవత్సరాలు దేశం కోసం సేవ చేశానని తెలిపారు. అదే స్ఫూర్తితో వేటపాలెం రోటరీ క్లబ్ లో, సభ్యులుగా చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. బాబురావుకు శాలువా కప్పి ఘనంగా సత్క రించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి ఏవి సురేష్ బాబు, గుత్తి. పరంజ్యోతి, సీతారామయ్య, మణికంఠ, పద్మాకర్ రావు తదితరులు పాల్గొన్నారు

## అండర్ 13 పుట్ బాల్ టోర్నీ తృతీయ స్థానంలో విశాఖ జిల్లా టీం




భీమిలి ప్రజాపాలన ప్రతినిధి ఆగస్ట్ 30:: ఆంధ్ర ప్రదేశ్ పుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ (యన్టీఆర్ జిల్లా ) లయోలా కళాశాల లో 29-30 తేదీల్లో అండర్ 13 పుట్ బాల్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది జిల్లా తరుపున ఆడి తృతీయ స్థానంలో నిలిచిన టీం లో ఆటగాడైన కోలా బాగ్యేష్ కి ప్రత్యేక అభినందనలు తెలిపిన అవంతి ఈ టోర్నీ లో విశాఖ జిల్లా అండర్ 13 టీం పాల్గొని మూడవ స్థానంలో నిలిచింది. ఆటగాళ్ళు తమ ప్రతిభను ప్రదర్శించి బాగా ఆడి గెలుపు ఓటములు ఎలా ఉన్నా మూడో స్థానంలో నిలిచినందుకు గాను ఆంధ్ర ప్రదేశ్ పుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరు యంపి కె.శీదర్ గారు - విశాఖ జిల్లా పుట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు యం.రాజారావు గారు - జిల్లా శెక్రటరీ అక్కరమాని చినబాబు గారు - విశాఖ జిల్లా అండర్ 13 టీం కోచ్ కృష్ణ గారు - శ్రీ పోలమాంబ పుట్ బాల్ అసోసియేషన్ సీనియర్ మెంటర్ కోలా చంద్ర శేఖర్ గారు - వైసిపి పార్టీ యూత్ ప్రెసిడెంట్ చిల్ల హరి గారు అభినందనలు అనంతపూర్ లో త్వరలో జరగబోయే జాతీయ పుట్ బాల్ టోర్నీ లో ఆంధ్ర ప్రదేశ్ జట్టు పాల్గోలడం జరుగుతుంది అని ఆంధ్ర ప్రదేశ్ పుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ వివరించారులి

## మీర్జాపురంలో అక్రమణల పర్వం....



నూజివీడు, ఆగస్టు 30, ప్రజాపాలన ప్రతినిధి: ఎంతో విలువైన ప్రభుత్వ భూములు, రోడ్లకు ఇరువైపులా ఉండే డ్రైనేజీలను ఆక్రమిస్తూ వ్యాపార దుకాణాలను నిర్మిస్తుంటే అధికారులు మాత్రం అవినీతి మత్తులో జోగుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నూజివీడు మండలం మీర్జాపురం గ్రామంలోని ప్రధానమైన ఎం ఎన్ కె రహదారి కి ఇరువైపుల డ్రైనేజీలను, ఎంతో విలువైన భూములను ఆక్రమించి వ్యాపార దుకాణాలను నిర్మిస్తూ ఉండగా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. పటిష్టంగా నిర్మాణాలను పూర్తి చేసి బోర్డులు పెట్టి వ్యాపారాలను యదేచ్ఛగా కొనసాగిస్తుంటే, అవినీతి మత్తులో జోగుతున్న అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్తులు తెలియచేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే హనుమాన్ జంక్షన్ - నూజివీడు ప్రధాన రహదారి కావడంతో వేలాది వాహనాలు, కొన్ని సందర్భాలలో భారీ వాహనాలు సైతం రాకపోకలు కొనసాగిస్తూ ఉండడంతో ఏ క్షణంలో ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ ఆక్రమణ ప్రదేశాలలో అనేక ప్రమాదాలు జరిగి ప్రజలకు, వాహన చోదకులకు, పశువులు యాక్సిడెంట్లు జరిగినప్పుడు మరణించడంతోపాటు కొంతమందికి అవయవాలు కోల్పోవడం కూడా జరిగింది. నిత్యం ఇలాంటి సంఘటన జరుగుతున్న కూడా అధికారుల్లో మాత్రం చలనం లేకపోవడంపై గ్రామస్తులు పెదవి చేస్తున్నారు. ఆక్రమణలపై గ్రామస్తులు ఫిర్యాదు చేస్తున్నప్పుడు అధికారులు తాత్కాలికంగా ఆ కట్టడాలను ఆపివేస్తున్నారు తప్ప వాటిని పూర్తిగా ధ్వంసం చేయడం లేదు దీంతో కొంతకాలం తర్వాత ఆక్రమణదారులు అదే కట్టడాలపై కట్టడాలను ప్రారంభిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ కట్టడాలను పూర్తిగా ధ్వంసం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అంతేకాకుండా పెను ప్రమాదం సంభవించి భారీ నష్టం జరిగిన తరువాత బాధపడటం కంటే ముందుగానే ఆక్రమణలను తొలగించి, ప్రమాదాలను నివారించాలని వాహన చోదకులు, గ్రామస్తులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

సంపాదకీయం

గురువారం 31, ఆగష్టు 2023

# ఓనాటి తిరుమల.. నీరు, ప్రసాదం!

మనఆలయాల చరిత్రను నిష్పక్షపాతంగా చర్చించుకునే పరిస్థితులు ఇప్పుడు లేవు. రాజకీయాల కోసం ఆలయాల కేంద్రంగా రేకెత్తిస్తున్న వివాదాలతో అసలు చరిత్ర మరుగున పడిపోతోంది. ఈ వివాదాలకు భిన్నంగా చరిత్ర లోతుల్లోకి వెళితే ఆలయాలకు సంబంధించిన విశేషాలెన్నో తెలుస్తాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాధాన్యత మనందరికీ తెలుసు. భక్తకోటిలో దానికున్న స్థానాన్ని దేనితోనూ పోల్చలేం. కొన్ని దశాబ్దాల నిర్వహణ సామర్థ్యాన్ని పరిశీలిస్తే దీనికి సాటైనది దేశంలో మరొకటి ఉందని చెప్పుకోలేం. వనరులు, ఆదాయం వారీగా కూడా తిరుమల దరిదాపుల్లోకి వచ్చే ఆలయాల్లేవు. ప్రజా ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు చేసిన తర్వాత దేవాలయాల నిర్వహణలో సమర్థత పెరిగింది. దీన్ని కాదనలేం. బ్రిటిషు పాలనలోనూ కొన్ని పద్ధతులు, విధానాలు వచ్చాయి. అవి కూడా ఎంతో కొంత ఆలయాల నిర్వహణలో జవాబుదారీతనాన్ని తీసుకువచ్చాయి. కానీ మన చరిత్ర ఎంతో సుదీర్ఘమైంది. ఇంతటి సుదీర్ఘ చరిత్రలో వ్యవస్థల నిర్వహణకూ స్పష్టమైన విధివిధానాలు ఉండకుండా ఉండవు. వాటిని వెలికి తీయటం చరిత్రకారుల పని. ఆనాటి పరిస్థితుల నేపథ్యంలో వాటి మంచిచెడ్డలను హేతుబద్ధంగా అంచనా వేయటం వారు చేయాలి. బ్రిటిషు పాలనకు ముందు ఆలయాల పరిస్థితులేమిటి? వాటి నిర్వహణ సామర్థ్యం ఎంత? ఆ సామర్థ్యంలో తేడాలొస్తే ఆనాటి ప్రభుత్వాలు ఎంతమేరకు జోక్యం చేసుకునేవి? ఆలయాలకు వచ్చే నిధులను దేనికి ఉపయోగించేవారు? ఆలయాలు వాటిని సక్రమంగా వినియోగిస్తాయన్న భరోసా దాతలకు ఎవరు కల్పించేవారు? వివాదాలను ఎలా పరిష్కరించేవారు? వీటికి జవాబులు అన్వేషించకుండా ఆలయాల చరిత్రను అర్థం చేసుకోలేం. దక్షిణాది ఆలయాల చరిత్రను ఈ కోణాల్లో అర్థంచేసుకోవాలంటే నిష్పక్షపాతంగా అధ్యయనం చేయాలి. అట్లా చేసిన వాళ్లల్లో అమెరికాకు చెందిన చరిత్రకారుడు బటన్ స్టెయిన్‌ను ప్రముఖంగా చెప్పుకోవచ్చు. తిరుమల దేవస్థానం ఆర్థిక నిర్వహణ మీద ఎంతో పరిశోధన చేసి 1957లో సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించి పీహెచ్‌డీని పొందారు. ఆ తర్వాత రాసిన వ్యాసాలు, పుస్తకాలు కూడా విశ్లేషణ పరంగా ఎంతో లోతైనవి. అందులోనూ తిరుమలపై రాసింది మరింత ప్రత్యేకమైంది. సంప్రదాయ గాథల ద్వారా మనకు తెలిసే తిరుమల చరిత్రకు ఎన్నో పరిమితులు ఉంటాయి. కల్పనలు, విశ్వాసాల మీద అది ఆధారపడింది. వాస్తవ చరిత్ర దృష్ట్యా చూస్తే తిరుమల ప్రస్తావనలు 9వ శతాబ్దం తర్వాతే ప్రముఖంగా కనపడతాయి. తిరుపతి ప్రస్తావనలు కూడా అంతే. చారిత్రకంగా తిరుమల విశేషాలను తెలుసుకోటానికి రాతి శాసనాలే ప్రధాన ఆధారం. దాదాపు వేయి శాసనాలు వెలుగులోకి వచ్చాయి. 9 నుంచి 16వ శతాబ్దం వరకూ తిరుమల ఆర్థిక వ్యవహారాలను ఈ శాసనాల ఆధారంగానే స్టెయిన్ అధ్యయనం చేశారు. ఇన్ని శాసనాలు ఉండటం తిరుమల విశిష్టత. ఇతర విశేషాలు ఉన్నప్పటికీ ఈ శాసనాలు ముఖ్యంగా తిరుమలకు ఇచ్చిన భూదానాలు, నగదు సమర్పణల గురించే ఎక్కువగా చెబుతాయి. మొదట్లో పరిమితంగా ఉన్న దానాలు విజయనగర రాజుల కాలంలో బాగా పెరిగాయి. విజయనగర కాలానికి ముందు దక్షిణాదిలో చాలా రాజవంశాలు పరిపాలన చేసినప్పటికీ వైష్ణవ మతానికి పెద్ద ప్రాధాన్యం దక్కలేదు. దాదాపు మూడు వందలేళ్ల పాటు విజయనగర ప్రభావం దక్షిణాది అంతటా ఉండేది. ఆర్థికంగానూ మెరుగైన పరిస్థితులు ఉండేవి. పాలక వర్గాల ఆదరణతో తిరుమలకు ఆర్థికంగా అంతకు ముందెన్నడూ లేనంత చేదోడు లభించింది. 1456–1570ల మధ్య 115 గ్రామాలను తిరుమలకు దానంగా ఇచ్చారు. నగదు సమర్పణలు భారీగానే వచ్చాయి. మూడువందలకు పైగా ఉన్న దానకర్తల కోసం ప్రత్యేక పూజలు, అర్చనలు చేసేవారు. గ్రామాలను ఇచ్చిన వారిలో విజయనగర రాజులతో పాటు సేనానాయకులు, సామంతులూ ఉన్నారు. ఒకవైపు నుంచి గ్రామాలు, మరోవైపు నుంచి నగదు విరాళాలు... వీటిని ఏం చేసేవారు? ఎవరికైనా వచ్చే సందేహమే ఇది. 1380ల్లో తిరుమలకు సంబంధించి ఒక ముఖ్య పరిణామం జరిగింది. 12 మందితో కూడిన ధర్మకర్తల (ట్రస్టీలు) నిర్వహణ కిందకు ఆలయం వచ్చింది. 1380ల కంటే రెండు వందలేళ్ల ముందు నుంచీ తిరుమల ప్రతిష్ఠ క్రమేపీ ఇనుమడించింది. దక్షిణాదిలో ప్రముఖ ఆలయంగా గుర్తింపు పొందటం మొదలైంది. చోళ రాజుల కాలంలో జరిగిన వేధింపుల వల్ల వైష్ణవులకు తిరుమలే శరణ్యంగా మారింది. 1450ల తర్వాత ధర్మకర్తల ఆలయ ఆర్థిక నిర్వహణ కొత్త పుంతలు తొక్కింది. దానంగా వచ్చిన గ్రామాలను ఆర్థికంగా పరిపుష్టం చేయటం ఇందులో కీలకమైంది. దానకర్తల పేరిట అర్చనలు, పూజలు క్రమపద్ధతిలో జరగాలంటే వచ్చిన నగదు విరాళాలను లాభదాయకంగా పెట్టుబడి పెట్టాలి. ఆనాటి కొన్ని ఆలయాలు నగదును వ్యాపారులకు వడ్డీకి ఇచ్చేవి. ప్రజలకు ప్రాతినిధ్యం ఉండి విస్తృత అధికారాలతో కూడిన గ్రామ సభలు ఉన్న చోట్ల వాటికి అప్పులు ఇచ్చేవారు. కానీ తిరుమల మాత్రం ప్రధానంగా నీటిపారుదల సౌకర్యాలపైనే వచ్చిన నగదును వెచ్చించింది. ముఖ్యంగా తిరుపతి–చంద్రగిరి ప్రాంతంలోని దాన గ్రామాల్లో అనేక విధాలుగా నీటి పారుదల సౌకర్యాలను మెరుగుపరచారు. ఆ గ్రామాల్లో వ్యవసాయ ఉత్పత్తి పెరగటానికి ఇది దోహదం చేసింది. ఆలయానికి వచ్చే ఆదాయమూ పెరిగింది. భవిష్యత్తు గురించి ఆలోచన లేకుండా వచ్చిన నగదుని పూజలు, కైంకర్యాలకు ఖర్చుపెట్టేయటం చాలా తేలిక. కానీ దాతలు కూడా తమ పేరిట దీర్ఘకాలం పూజలు, అర్చనలు జరగాలని కోరుకునేవారు. అది జరగాలంటే ఏటా ఆదాయం వచ్చేలా నగదుని పెట్టుబడిగా పెట్టాలి. అందుకే సగటున ఏటా 10–15 శాతం ఆదాయం వచ్చేలా పెట్టుబడులు పెట్టారు. దాతలు కూడా తమ విరాళాల్లో ఎంత మొత్తం పెట్టుబడులుగా పెట్టాలో నిర్దేశించేవారు. పెట్టుబడులు పెట్టాలంటే గ్రామాల నేల స్వభావం, అక్కడి నైసర్గిక పరిస్థితులు, పంటల సరళి, మార్కెటింగ్ సౌకర్యం లాంటి చాలా విషయాలను తెలుసుకోవాలి. అందుకు నేర్పరితనం ఉండాలి. ఆలయ పాలనాధికారులు దీన్ని సాధించటానికి బాగా కృషి చేశారు.గ్రామాలను ఆలయాలకు దానాలుగా ఇవ్వటం దేశమంతా జరిగింది. తరాలుగా ఎంతో శ్రమతో సాగు చేసుకుంటున్న భూముల నుంచి వచ్చే ఆదాయాన్ని ఆలయాలకు అర్పించటానికి రైతులు ఎక్కడా సిద్ధంగా ఉండరు. దైవానికి సైతం ఆదాయంలో తృణమో పణమో స్వచ్ఛందంగా ఇవ్వటానికి మాత్రమే రైతులు ముందుకు వస్తారు తప్ప, ఆదాయంలో సింహభాగాన్ని ఇవ్వటానికి ఇష్టపడరు. కానీ ప్రాచీన, మధ్య యుగాల్లో రైతుల అభీష్టంతో పెద్దగా పనిలేదు. పాలకులు ఏర్పరచిన పద్ధతులే చెల్లుబాటు అయ్యేవి. గ్రామాలను దానంగా ఇచ్చినంత మాత్రాన భూములపై సర్వహక్కులూ ఆలయాలకు దఖలు పడలేదు. ఆ భూముల నుంచి గతంలో ప్రభుత్వానికి వాటాగా వెళ్లే పంట.. దానం అనంతరం ఆలయానికి వెళ్లేది. తేడా ప్రధానంగా అదే. పంటలో కొన్ని చోట్ల 50 శాతం, మరికొన్ని చోట్ల 75 శాతం వాటా ఆలయానికి వెళ్లేది. అజమాయిషీ పరంగా భూములు ఆనాడు నాలుగు రకాలుగా ఉండేవి. 1) భాండారు వాడ భూములు. అంటే పైనున్న రాజు అజమాయిషీలో ప్రత్యక్షంగా ఉండేవి. 2) అమరం భూములు. అంటే సేనానాయకుల కింద ఉండే గ్రామాలకు చెందినవి.

# బ్రిక్స్ సదస్సు .. ధనిక దేశాలకు హెచ్చరిక !




విచ్ఛిన్నం, ఆర్థిక బలవంతం చేయాలని చూస్తున్న శక్తుల చర్యలను అడ్డుకోవాలని, చైనా అధినేత సీ జిన్‌పింగ్ తాజా సమావేశంలో పిలుపునిచ్చారు. ఇదే తరుణంలో డిజిటల్ ఎకానమీ, హరిత వృద్ధి, సరఫరా వ్యవస్థల వంటి రంగాలలో ఆచరణాత్మక సహకారం అందించుకోవాలని కోరారు. అంతర్జాతీయ రంగంలో పెద్ద గొంతులేసుకొని, కండల ప్రదర్శనలతో తమ స్వంత నిబంధనలను రుద్దాలని చూస్తున్నవారి తీరు ఆమోదం కాదని, ఐరాస నిబంధనలకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. ఆగస్టు 22 నుంచి 24వ తేదీ వరకు దక్షిణాఫ్రికా నగరమైన జోహానెస్‌బర్గ్‌లో "బ్రిక్స్ (బిఆర్‌ఐసిఎస్)" కూటమి (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) పదిహేనవ శిఖరాగ్ర సమావేశం జయప్రదంగా ముగిసింది. అర్జెంటీనా, ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌ను ఈ కూటమిలో చేరాల్సిందిగా ఆహ్వానం పలికారు. వాటికి అంగీకారమైతే 2024 జనవరి ఒకటవ తేదీ నుంచి పూర్తి స్థాయి సభ్యులుగా పరిగణిస్తారు. న్యూయార్క్ లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో 2006లో జరిగిన ఒక సమావేశంలో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలతో ఏర్పడిన ఆర్థిక కూటమిని బ్రిక్ అని పిలిచారు. తరువాత 2010లో దక్షిణాఫ్రికా చేరటంతో అది బ్రిక్స్‌గా మారింది. ఇప్పుడు విస్తరణ బాటలో ఉన్నందున బ్రిక్స్ ప్లస్ అంటారా లేక మరేదైనా పేరు పెడతారా అన్నది చూడాల్సి ఉంది. బ్రిక్ లేదా బ్రిక్స్ కూటమి అని పేరు పెట్టటానికి గోల్డ్‌మన్ శాచస్ కంపెనీ ఆర్థికవేత్త జిమ్ ఓ నెయిల్ చేసిన వర్ణన ప్రేరణ అని చెబుతారు. ఇలాంటి కూటమి ఏర్పడితే అది 2050 నాటికి ప్రపంచ ఆర్థిక రంగంలో మిగతా వాటిని వెనక్కు నెడుతుందని 2001లో జోశ్యం చెప్పాడు. బ్రిక్స్ విస్తరణ, దాని తీరుతెన్నులను చూస్తే అంతకంటే ముందే దాని ప్రభావం వెల్లడయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిదానమే ప్రధానం అన్నట్లుగా ముందుకు పోతున్న ఈ కూటమి నేడు పశ్చిమ దేశాల పెత్తనం, తంటాలమారితనాన్ని ఎదుర్కొనే దిశగా ఉంది. నూతన ప్రపంచ ఆర్థిక, రాజకీయ వ్యవస్థ కోసం చూస్తున్న ఈ కూటమి నడక నల్లేరు మీద బండిలా ఎలాంటి కుదుపులు లేకుండా సాగుతుందని చెప్పలేము. ఈ సమావేశాల్లో లూలా డసిల్వా (బ్రెజిల్), సెర్గీలావరోవ్ (రష్యా విదేశాంగ మంత్రి), నరేంద్ర మోడీ (ఇండియా), సీ జిన్‌పింగ్ (చైనా), సిరిల్ రమాఫోసా (దక్షిణాఫ్రికా) పాల్గొన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ మీద అంతర్జాతీయ కోర్టు వారెంటు జారీ చేసింది. ఆ కోర్టును రష్యా అంగీకరించలేదు. బ్రిక్స్‌కు ఆతిథ్యం ఇస్తున్న దక్షిణాఫ్రికా కోర్టు ఒప్పందంలో సభ్యురాలిగా ఉన్నందున తలెత్తే పరిస్థితి కారణంగా పుతిన్ హాజరు కాలేదు. పారిశ్రామిక, సరఫరా గొలుసు నుంచి విడగొట్టుకోవాలి. విచ్ఛిన్నం, ఆర్థిక బలవంతం చేయాలని చూస్తున్న శక్తుల చర్యలను అడ్డుకోవాలని, చైనా అధినేత సీ జిన్‌పింగ్ తాజా సమావేశంలో పిలుపునిచ్చారు. ఇదే తరుణంలో డిజిటల్ ఎకానమీ, హరిత వృద్ధి, సరఫరా వ్యవస్థల వంటి రంగాలలో ఆచరణాత్మక సహకారం అందించుకోవాలని కోరారు. అంతర్జాతీయ రంగంలో పెద్ద గొంతులేసుకొని, కండల ప్రదర్శనలతో తమ స్వంత నిబంధనలను రుద్దాలని చూస్తున్నవారి తీరు ఆమోదం కాదని, ఐరాస నిబంధనలకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. ఒక దేశం– ఒక కూటమి పెత్తనం లేకుండా ముందుకు వస్తున్న బహుళధ్రువ ప్రపంచం, సాంప్రదాయక విలువలు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు నూతన ఉదారవాద విధానాలు ముప్పు తెస్తున్నట్లు వీడియో ద్వారా పుతిన్ చేసిన ప్రసంగంలో పేర్కొన్నాడు. అమెరికా పేరు పెట్టకుండా దాని గురించే మాట్లాడినట్లు విశ్లేషకులు టీకా తాత్పర్యం చెప్పారు. పశ్చిమ దేశాలు బ్రిక్స్ కూటమి తమకు ముప్పుగానూ, జి–7కు పోటీగా దాన్ని మార్చేందుకు చైనా చూస్తున్నదనే అనుమానాలు పశ్చిమ దేశాల్లో రోజు రోజుకూ పెరుగుతున్నాయి. విస్తరణలో భాగంగా చేరుతున్న దేశాలు కూడా పశ్చిమ దేశాల బాధితులే కావటం గమనించాల్సిన అంశం. ప్రపంచంలో ఏ దేశమూ గతంలో మాదిరి ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణంలో నడవాలని కోరుకోవటం లేదు. బ్రిక్స్ దేశాల్లోని జనాభా 2022 లెక్కల ప్రకారం 324 కోట్ల మంది, అంటే ప్రపంచంలో నలభై శాతం మంది. భారత్, చైనాల్లోనే 382 కోట్ల మంది ఉండగా మిగిలిన మూడింటిలో 42 కోట్ల మంది ఉన్నారు. ప్రపంచ సాధారణ జిడిపిలో ఈ కూటమి వాటా 2000లో 11.74 శాతం కాగా పదేళ్లలో 17.95, 2022 నాటికి 26 శాతానికి పెరిగింది. అదే పిపిపి పద్ధతిలో చూస్తే 31.5 శాతానికి పెరిగి జి–7 దేశాల 30 శాతాన్ని దాటింది. 2028 నాటికే బ్రిక్స్ వాటా 50 శాతం దాట నుందని అంచనా. ఐఎంఎఫ్ సమాచారం ప్రకారం 2000 సంవత్సరం నుంచి 2022కు చూస్తే జనాభా వాటా 43.92 నుంచి 41.42 శాతానికి తగ్గింది. ప్రపంచ ఎగుమతుల్లో వాటా 8.2 నుంచి 18, ప్రపంచ వాణిజ్యంలో 7.51 నుంచి 18 శాతానికి, విదేశీ మారకద్రవ్య నిల్వ 281.2 నుంచి 4,581 బిలియన్ డాలర్లకు పెరిగింది. అంక్టాడ్ 2023 గణాంకాల ప్రకారం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) 2001–2021 కాలంలో 84 నుంచి 355 బి.డాలర్లకు పెరిగాయి. ఈ మొత్తంలో చైనా వాటా సగానికి పైగా ఉంది. ఒక్క జనాభాలో భారత్ ప్రథమ స్థానంలో ఉండటం తప్ప మిగిలిన అన్ని అంశాలలో చైనా ఎంతో ఎత్తున ఉంది. జోహానెస్‌బర్గ్ శిఖరాగ్ర సభలో మొత్తంగా భిన్న నేపథ్యాల పూర్వరంగంలో దేశాల మధ్య వ్యూహాత్మక, ఆర్థిక, ప్రపంచ సమస్యలపై ఏకీభావం సాధించేందుకు సంప్రదింపులకు ప్రాధాన్యత ఇవ్వాలన్న సంకల్పం వెల్లడైంది. సమీకృత అభివృద్ధి, ప్రపంచ సవాళ్లు, దేశాల మధ్య సంబంధాలను పటిష్టపరుచుకోవాలన్న వాంఛను నేతలు వెలిబుచ్చారు. సభ జరిగింది ఆఫ్రికా ఖండంలో గనుక సహజంగానే దాని ఇతివృత్తానికి కేంద్ర స్థానం లభించింది. ప్రపంచ పేద దేశాలు ప్రత్యేకించి ఆఫ్రికా దేశాలతో సంబంధాలు, సహకారం గురించి నేతలందరూ మాట్లాడారు. ఈ సభకు పుతిన్ రాకపోవటం గురించి పశ్చిమ దేశాల్లో ఇంకేముంది బ్రిక్స్‌లో విబేధాలు, రష్యా పలుకుబడికి గండిపడింది అన్నట్లుగా విశ్లేషణలను వండివార్చారు. ముందే చెప్పుకున్నట్లు ఆతిథ్య దేశాన్ని ఇరకాటంలో పెట్టకూడదన్న పరిణితి పుతిన్, ఇతర దేశాధినేతల్లో వెల్లడైంది. స్వయంగా హాజరు బదులు వీడియో కాన్ఫరెన్సు ద్వారా పాల్గొని నిర్ణయాల్లో భాగస్వామి అయ్యారు. బ్రిక్స్‌ను విస్తరించాలన్న ఆలోచన కొత్తగా వచ్చింది కాదు. 2013లో దక్షిణాఫ్రికా అధ్యక్ష స్థానంలో ఉన్నపుడు ఆఫ్రికా యూనియన్‌కు స్థానం కల్పించాలని కోరింది. తరువాత 2017లో బ్రిక్స్ ప్లస్ (బ్రిక్స్‌తో పాటు ఇతర దేశాలు) అన్న భావనను చైనా ముందుకు తెచ్చింది. తమకు సభ్యత్వం ఇవ్వాలని ఇరాన్, అర్జెంటీనా దరఖాస్తు చేసుకోవటంతో 2022లో బ్రిక్స్ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో మొత్తం నలభై దేశాలు ఆసక్తి వెల్లడించటంతో పాటు 23 లాంఛనంగా దరఖాస్తు చేశాయి. వాటిని పరిశీలించి పైన పేర్కొన్న ఆరు దేశాలకు వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి పూర్తి స్థాయి సభ్యత్వం ఇచ్చేందుకు నిర్ణయించారు.ప్రపంచ జనాభాలో ఈ కూటమి దేశాల్లో 46.5 శాతానికి, జిడిపి 30 శాతానికి పెరగనుంది. విస్తరణతో ఈ కూటమి దేశాల చమురు వాటా ప్రపంచంలో 20.4 నుంచి 43.1 శాతానికి పెరగనుంది. ప్రపంచ సహజ వాయువులో 30 శాతం కలిగి ఉన్నాయి, ప్రపంచ చమురు ఎగుమతుల్లో వాటా 18 నుంచి 25.1 శాతానికి పెరగనుంది. ప్రపంచ ఆర్థిక రంగం మీద పెత్తనం చేస్తున్న డాలరును వెనక్కు నెట్టి బ్రిక్స్ కరెన్సీని ప్రవేశపెట్టాలన్న ఆలోచన మీద కూడా జోహానెస్‌బర్గ్ సమావేశాల్లో చర్చ జరిగింది. కొన్ని దేశాల సందేహాల కారణంగా ముందుకు పోలేదు. ఉమ్మడి కరెన్సీని పంచుకోవటం గురించి బ్రెజిల్ ప్రతిపాదన ముందుకు తేగా మన దేశం భిన్న వైఖరిని వెల్లడించింది. ఈ అంశం ప్రస్తుత సమావేశ ఎజెండాల్లో లేదని దక్షిణాఫ్రికా పేర్కొన్నది. డాలర్లకు బదులు ఆయా దేశాల కరెన్సీలతో లావాదేవీలు జరపాలని చైనా, రష్యా పేర్కొన్నాయి. అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటున్న ఈ దేశాలు సహజంగా డాలరును వ్యతిరేకిస్తున్నాయి. డాలర్లలో లావాదేవీల వాటా 2015లో వాటి వాటా 90 శాతం ఉండగా 2020 నాటికి 46 శాతానికి, తరువాత ఇంకా తగ్గింది. మన దేశం మాత్రం ఎగుమతులు–దిగుమతులకు 80 శాతం డాలర్లనే వాడుతున్నది.ప్రస్తుత విస్తరణ, రానున్న రోజుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్న దేశాల పెరుగుదలను చూసినపుడు ప్రపంచ బలాబలాల్లో ఈ కూటమి కీలకంగా మారనున్నదనేది స్పష్టం. మన దేశం, చైనాతో సహా మిగిలిన దేశాలన్నీ బహుముఖ ప్రపంచ వ్యవస్థ ఉండాలని కోరుతున్నాయి. ఈ కూటమిలో ఉన్న దేశాల ఆర్థిక రంగాలను చూసినపుడు తేడా చాలా ఎక్కువగా ఉంది. అందువలన వాటి ప్రయోజనాలు, ప్రాధాన్యతలు కూడా వేరుగా ఉంటాయి. ఉదాహరణకు మన దేశం చైనాను అధిగమించాలని చూస్తున్నట్లు బహిరంగంగానే వాంఛ వెల్లడిస్తున్నది. వివాదాస్పద అంశాలపై కూడా ఈ కూటమిలో పూర్తి ఏకీభావం లేనందున అంగీకృత అంశాల మీదనే కేంద్రీకరణ జరుగుతున్నది. ఇండో–పసిఫిక్ పేరుతో చైనా వ్యతిరేక కూటమి నిర్మాణానికి పూనుకున్న అమెరికాకు దక్షిణ చైనా సముద్రంలో స్వేచ్ఛగా నౌకలు తిరిగేందుకు అవకాశం ఉండాలంటూ మన దేశం మద్దతు ఇస్తున్నది. ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలను సమర్ధించనప్పటికీ అమెరికాకు ఆగ్రహం కలగకుండా ఇరాన్ నుంచి చమురు కొనుగోలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఒక విధంగా చెప్పాలంటే ఎవరికీ నొప్పి తగలకూడదనే వైఖరితో మన దేశం గడసాము గారడీలు చేస్తున్నది. లండన్‌లోని సోయాజ్ చైనా సంస్థ డైరెక్టర్ స్టీవ్ సాంగ్ మాట్లాడుతూ బ్రిక్స్ సభ్యదేశాలు ఉపరితలంతో ఒకేవిధంగా లేవని, అయినప్పటికీ ఎవరూ పశ్చిమ దేశాల ఆధిపత్య ప్రపంచంలో జీవించకూడదని అందరూ అనుకుంటున్నట్లుగా చూపేందుకు సీ జిన్‌పింగ్ చూశారని, చైనా వారు చూపుతున్న ప్రత్యామ్నాయంలో నిరంకుశులు తమ స్వంత దేశాల్లో సురక్షితంగా ఉండవచ్చని, ప్రజాస్వామిక అమెరికా, ఐరోపా దేశాలు రుద్దిన షరతులను అంగీకరించకుండా ప్రత్యామ్నాయ అభివృద్ధి పథాన్ని కనుగొనవచ్చనే భావన ఉన్నదని అన్నాడు. తమకు గానీ మరొక దేశానికి గానీ ప్రత్యర్ధిగా రాజకీయ ప్రత్యర్ధి తయారవుతున్నట్లుగా తాము భావించటం లేదని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులవాన్ సమావేశ ప్రాధాన్యతను తక్కువ చేసి చూపేందుకు, వక్రీకరించేందుకు చూశారు. కొత్తగా బ్రిక్స్‌లో చేరిన ఆరు దేశాల్లో ఏ ఒక్కటీ అమెరికా వ్యతిరేకమైనది లేదని వాషింగ్టన్ లోని క్విన్సీ సంస్థ డైరెక్టర్ సరంగ్ షిడోర్ అన్నాడు. ఈ సమావేశాల తరువాత పశ్చిమ దేశాలకు చెందిన విశ్లేషకులు, మీడియా వార్తల తీరు వక్రీకరణ, కూటమిలో అనుమానాలను రేకెత్తించేదిగా, తంపులు పెట్టేదిగా ఉందని చెప్పవచ్చు.

# చంద్రయాన్



చంద్రయాన్ సఫలమై చందమామపై చేరి వినువీధిని మెరిసింది మువ్వన్నెల మనజెండాఆనందం పొంగింది భరతావని మదినిండా.అయితే: ప్రతి విజయం వెనుక అనేక మంది సమిష్టి కృషి ఉంటుంది.కానీ, ఆ విజయాన్ని ఒకడి ఎకౌంట్ లో వేయడం, భారతీయులవైన మనకు ఆనవాయితీ. ఎందుకంటే మనం హీరోవర్షిప్ సాంప్రదాయంలో పెరిగాం . పెరుగుతున్నాం.మతరంగు పూయడం మన సంస్కారం.ఎందుకంటే మతసంస్కృతిలో బ్రతుకుతున్నాం కదా.చంద్రయాన్ విజయం అందుకు మినహాయింపు కాదు. చంద్రయాన్ విజయం వెనుక అన్ స్కిల్డ్ వర్కర్స్ , స్కిల్డ్ వర్కర్స్ నుంచి, సైంటిస్టులు ఛైర్మన్ వరకూ అందరి శ్రమ ఉంది. పూర్వీకుల విజన్ దాగివుంది.ఈ విజయాన్ని ఏ ఒక్క నాయకుడికో ఛైర్మన్ కో కట్టబెట్టడం అజ్ఞానం. తానొక్కడే ఏదో చేసినట్టు తన జన్మ ధన్యమైందని ప్రకటించుకోవడం సంకుచిత అభద్రతా భావం.

చంద్రయాన్ విజయం, సమిష్టి విజయం.భాషా ప్రాంతాలకూ కులమతాలకూ అతీతంగా ప్రతియొక భారతీయునికీ పర్వదినం. నవభారత వైతాళికుల అపూర్వ ఘనవిజయం. జయహో భారత్!

**తాతపూడి రవీంద్రనాథ్ టాగోర్**
**ఛైర్మన్– మానస ఫౌండేషన్.**

## క్రీడలలో కూడా నెం.1 గా నిలిచిన సన్ స్కూల్



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి ఆగస్ట్ 30: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో అత్యంత క్రీడా ప్రతిభను కనబరచిన వాటిలో సన్ స్కూల్ ప్రథమ స్థానంలో నిలిచింది. తేది. 29.08.23 న గోపాలపట్నం %ణూూ% మినీ స్టేడియం వేదికగా విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ గౌరవనీయులైన ప్రిశ్వనాథన్, చేతుల మీదుగా, విద్యార్థులు జ్ఞాపికను మరియు ప్రశంసా పత్రంను అందుకోవడం జరిగినది. సన్ స్కూల్ నందు ఏర్పాటు చేసిన అభినందన సభలో సన్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీ. కైతపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, జిల్లా స్థాయి క్రీడా ప్రతిభా పురస్కారం లో మన సన్ స్కూల్ ప్రథమ స్థానంలో ఉండడం చాలా గర్వ కారణమని, విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడారంగంలో కూడా తమ ప్రతిభను చాటుతున్నారని, ఇది చాలా ఆనందదాయకమని, విద్యార్థులందరినీ ప్రశంసిస్తూ, విద్యార్థులు ఇంతటి ఘనత సాధించడానికి కృషి చేస్తున్న వ్యాయమ ఉపాధ్యాయులైన అరుణ్ కుమార్, లక్ష్మీ మరియు .గౌరీ లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికిన మందుబాబులకు జరిమానా మరియు తగు శిక్షలు అమలు



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి ఆగస్ట్ 30 :తేది: 30-8-2023 న ఆనందపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో, వివిధ కూడళ్లలో మద్యం త్రాగి వాహనములను నడిపిన 37 మందిని, గౌరవనీయులైన 15 వ అడిషనల్ మెట్రో పొలిటన్ మేజిస్ట్రేట్ , భీమిలి వారి ఎదుట హాజరు పరచగా, గౌరవనీయులైన మేజిస్ట్రేట్ శ్రీమతి విజయ లక్ష్మీ గారు, మద్యం తాగి వాహానాలను నడిపిన ఒక్కొక్కరికి 1000/- రూపాయలు జరిమాన మరియు కమ్యూనిటీ సర్వీస్ ను శిక్ష గా విధించినారు. మొత్తముగా 37,000/- రూపాయలు ఫైన్ మరియు కమ్యూనిటీ సర్వీస్ లో భాగంగా సెయింట్ annµs స్కూల్ ,భీమిలి ఆవరణలో పరిశుభ్రం చేయించడం జరిగింది.

## ఏర్పేడు తాపీ మేస్త్రీలకు బహుమతులను అందిస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు



ప్రజాపాలన న్యూస్ శ్రీకాళహస్తి :బుధవారం భారతి సిమెంటు టెక్నికల్ ఇంజినీరు ఛాయాపతి భవన నిర్మాణాల్లో వినియోగిస్తున్న భారతి సిమెంట్ నాణ్యతను పరిశీలించారు. ఏర్పేడులో 11 పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ గదుల నిర్మాణానికి సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య చేపడుతున్న నిర్మాణంలో సిమెంటు నాణ్యతనుపరిశీలించారు. సిమెంటు, ఇసుక, నీరు మిశ్రమాలను ఉపయోగించి క్యూరింగ్ పద్ధతిని తాపీ మేస్త్రీలకు వివరించారు. భవన నిర్మాణకార్మికులకు భారతి సిమెంట్ తరఫున టీషర్టులనుఅందజేశారు. సర్పంచ్ శివయ్య, భారతి సిమెంట్ ఏర్పేడు సుమతి ట్రేడర్స్ అధినేత మధు సూధన రావు పాల్గొన్నారు.

## గుంటూరు అఖిల భారత ఎన్.జి.ఓస్ సంక్షేమ సంఘం మరియు కె.బి.ఆర్ ఫౌండేషన్ వెంపాడ శ్రీనివాసరెడ్డికి దక్కిన సన్మానం



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి ఆగస్ట్ 30: 5 వ వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించిన ఫౌండర్ కొడవటికంటి బాలరాజు ఆంధ్ర మరియు తెలంగాణ ఏరియాలో స్వచ్ఛంద సేవలు చేస్తున్న వారిని ఎంపిక చేసివారికి ఆ ఏరియా శాసన సభ్యులు .శ్రీ.మద్దాళి గిరిధర్ రావు చేతులు మీదుగా అందజేశారు ఇందులో భాగంగా మన తగరపువలస వాస్తవ్యులు వెంపాడ శ్రీనివాసరెడ్డి నిరంతరం చేస్తున్న సేవలను గుర్తించి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు .శ్రీ.మద్దాళి గిరిధర్ రావు చేతుల మీదుగా సాలువాతో సన్మానించి మెమోంటో జ్ఞాపిక అందజేశారు అంతేకాకుండ కె.బి.ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు కొడవటికంటి బాలరాజు అన్నయ్య వెంపాడ సేవలు విషయంలో ఎంతో మందికి సేవలో స్ఫూర్తి అని సభాముఖంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ గౌ.శ్రీమతి షేక్ సజీల మరియు ఆంధ్ర మరియు తెలంగాణ ఎన్.జీ.ఓస్. పాల్గన్నారు.

## చిరుధాన్యాల ప్రాధాన్యతపై అవగాహనా సదస్సు




నరసాపురం, ఆగస్టు 30 (ప్రజాపాలన ప్రతినిధి) : స్థానిక వై.ఎన్ కళాశాలలో నవకల్పన మరియు వ్యవస్థాపకత అభివృద్ధి కేంద్రం, భారతప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్ర ఏలూరు వారి ఆధ్వర్యంలో జీవనశైలిలో చిరుధాన్యాల ప్రాధాన్యత పై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బెజవాడ వెంకట రత్నం పాల్గొని మాట్లాడుతూ చిరుధాన్యాలను పూర్వం మన పెద్దలు ఎక్కువగా ఉపయోగించేవారని అందువలన వారు ఇప్పటికీ ఆరోగ్యంగా ఉండడం చూస్తున్నామని నేడు జంక్ పధార్థాలైన పిజ్జా, బర్గర్, బిర్యానీలు తినడం మనకు అలవాటైనదని తద్వారా మన ఆరోగ్యాన్ని మనమే పాడు చేసుకుంటున్నామని అన్నారు. మన జీవనశైలిలో చిరు ధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు, సామలు మొదలైన వాటిని అలవాటు చేసుకున్నట్లైతే ఆరోగ్యంతో పాటు మన తరవాత తరంవారికి కూడా బాట వేసినవారమవుతామని అన్నారు.కళాశాల డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ మాట్లాడుతూ నేడు అనేకమంది చిరుధాన్యాల వ్యాపారం చేస్తున్నారని యువత వీటిద్వారా ఉపాధి అవకాశాలను పెంచుకుంటున్నారని వీటిని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తూ విదేశీ కరెన్సీని తీసుకుంటున్నారని తద్వారా మన దేశం ముందంజలో ఉందని అన్నారు. చదువుల తర్వాత వీటిని ఆధారంగా చేసుకుని వ్యాపారాలు చేస్తూ ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్ర వాలంటీర్ ఓసూరి కుసుమరత్నం, సామాజిక సేవావిభాగ కో-ఆర్డినేటర్ బి.ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ యాకోబు, కామర్స్ అధ్యాపకులు ఆర్.వి. లక్ష్మిదేవి, షేక్ అలీషా, పి. గంగ, బి.బి.ఎస్. రాంబాబు, కె. పద్మశాంతి విధ్యార్ధిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్క చెల్లెమ్మలు సంతోషంగా ఉండాలి: ఎమ్మెల్యే గ్రంధి



భీమవరం, ఆగస్టు 30 (ప్రజాపాలన ప్రతినిధి) : సమాజంలో ప్రతి అక్క, చెల్లెమ్మ సంతోషంగా ఉండాలని కుటుంబంలో మహిళలు సంతోషంగా ఉంటేనే ఆ కుటుంబం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మహిళా లోకానికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ బుధవారం రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో మహిళల పేరుమీదనే ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. మహిళలకు రక్షణగా కట్టుదిట్టమైన చట్టాన్ని కూడా తమ ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. రానున్న రోజుల్లో ప్రతి అక్కను, చెల్లెమ్మ ను మరింత ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆలోచన చేస్తున్నారని ఆయన అన్నారు.

## లోకేష్ ను కలిసిన డాక్టర్ రాజ్యలక్ష్మి




నరసాపురం, ఆగస్టు 30 (ప్రజాపాలన ప్రతినిధి) :ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో యువగళం పాదయాత్రలో పాల్గొంటున్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను చింతలపూడి నియోజకవర్గంలోని గురువాయిగూడెంలో బుధవారం రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, పశ్చిమగోదావరి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నారా లోకేష్ తో కలిసి డాక్టర్ రాజ్యలక్ష్మి పాదయాత్రలో పాల్గొన్నారు.

## డాక్యుమెంట్ రైటర్ల పొట్ట కొట్టొద్దు: ప్రైమ్ -2 విధానం రద్దు చేయాలి



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి ఆగస్ట్ 30: ప్రభుత్వం దస్తావేజులు తయారీలో నూతన విధానం ప్రైమ్ 2 ద్వారా డాక్యుమెంట్ రైటర్లు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందని మండల డాక్యుమెంట్ రైటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏనుగులు సత్యారావు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులపాటు నిర్వహించిన డాక్యుమెంట్ రైటర్ల పెండవును కార్యక్రమం ఆనందపు సబ్ రిజిస్టర్ ఆఫీస్ ముందు నిరసన కార్యక్రమం తెలియజేశారుఈ సందర్భంగా సత్య రావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల మంది బస్తా లేఖరులు పనులు నిర్వహించి జీవనోపాధి పొందుతున్నారన్నారు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రైమ్ 2 విధానం ద్వారా బస్తా లేఖర్ల జీవనోపాధికి గండిపడుతుందన్నారుఅంతేకాకుండా దస్తావేజులు డిజిటల్ ద్వారా కొన్ని సమస్యలు తలెత్తాయని కోట్లాది రూపాయలతో కొనుగోలు చేసిన ఆస్తులకు సరైన రక్షణ లేకుండా పోతుందన్నారుప్రజలకు ఏ మాత్రం ఉపయోగం లేని, ప్రజలకు నష్టం కలిగే విధంగా లోపభూయిష్టంగా ఉన్న, లీగల్ కాంప్లికేషన్స్ తలెత్తే అవకావం ఉందన్నారు. ఒరిజినల్ దస్తావేజులు లేకుండా కేవలం డిజిటల్ దస్తావేజు డౌన్లోడ్ చేసుకుని అదే ఒరిజినల్ దస్తావేజుగా చలామణి అయ్యేటట్లుగా నూతనంగా అమలు చేయుటకు ప్రభుత్వం వారు నిర్ణయించిన ప్రైమ్-2 విధానం వల్ల తలెత్తే ఇబ్బందులను ప్రజలు దృష్టికి తీసుకువెళ్ళే ఉద్దేశ్యంతో ఆగస్ట్ 30, 31 తేదీలలో రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం వారి సూచన మేరకు దస్తావేజు లేఖర్లు చేస్తున్న పెన్ డౌన్ కార్యక్రమానికి సహకరించవలసినదిగా యావన్మందిని కోరుచున్నాము.

## కొనకళ్ళ నారాయణరావు హౌస్ అరెస్ట్



మచిలీపట్నం ఆగస్టు 30 ప్రజా పాలన:ప్రభుత్వం చేస్తున్న అక్రమ మైనింగ్ ఇసుక తవ్వకాలను వివరించడానికి ఇబ్రహీంపట్నంలోని డి ఎం జీ ప్రధాన కార్యాలయం నకు వెళుతున్న కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ పార్లమెంట్ సభ్యుడు కొనకళ్ళ నారాయణరావుని అడ్డగిస్తూ అక్రమ హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు...ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణ మాట్లాడుతు ,ఈ వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి సహజ వనరులను దోచుకొని ప్రజలకు అందనంత ఎత్తు లో పెట్టిందని ఈ రోజు ఇసుకను వాళ్ళ ఇష్టనుసారంగా తవ్వుకొని అమ్ముకొంటూ ఇసుక రేట్లు పెంచి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా చేసారని అయన అగ్రహం వ్యక్తం చేసారు. అదేవిధంగా ఇసుక క్వారిల వద్ద అధికారులు ఇచ్చేవే బిల్లులో ఎంత మొత్తంలో ఇసుక లోడ్ అవుతుందని? ఎంత రేటుకు అమ్ముతున్నారని? ఎవరికీ అమ్ముతున్నారని? కనీస సమాచారం లేకుండా ఇసుక సరఫరా చేస్తుంటే వారికీ స్థానిక శాసన సభ్యులు కూడా మద్దతుగా నిలవడం చాలా దారుణం అన్నారు.రాష్ట్రంలో లో ఈ వైసీపీ నాయకులు సహజ వనరులు దోచుకొంటున్న దాని గురించి ఇబ్రహీంపట్నం లోని డి ఎమ్ జి కార్యాలయంలో ప్రశ్నించడానికి వెళ్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులను అక్రమ హౌస్ అరెస్ట్ చేయడం దుశ్చర్య అని ఈ అక్రమ అరెస్ట్ లను అయన తేవ్రంగా ఖండిచారు.

## మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అరెస్ట్ ఠాణాకు తర లింపు



నందిగామ ఆగస్టు 30 ప్రజా పాలన ప్రతినిధి ఇసుక దోపిడీపై మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆమె అ నుచర గణం పలువురు తెలుగుదేశం పార్టీ నాయ కులు చేస్తున్న నిరసన కార్యక్రమాలలో భాగంగా వైసీ పీ ఇసుక దోపిడీ గురించి టీడీపీ సేకరించిన ఆధారా లను డి.ఎమ్.జి డైరెక్టర్ కు చూపించి వైసీపీ చేస్తున్న ఇసుక దోపిడీ అరికట్టాలని వినతిపత్రం అందజే యుటకు ఇబ్రహీంపట్నంలో ఉన్న డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ ప్రధాన కార్యాలయానికి బయలు దేరిన మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య ను ఇబ్రహీంపట్నం సౌమ్యని తెదేపా శ్రేణులను నిలువరించి అరెస్టు చేసిపోలీసుల ప్రత్యేక వాహనంలో విజ యవాడ వైపుగా భవానిపురం పోలీస్ స్టేషన్ కు తర లించారు.

## సి ఆర్ సి సమావేశంలో ను పరిశీలించిన ఏర్పేడు మండల ఎంఈఓ 2 దయాకర్



ఏర్పేడు ప్రజాపాలన న్యూస్: సి ఆర్ సి సమావేశంలో ను పరిశీలించిన ఏర్పేడు మండల ఎంఈఓ 2 దయాకర్. ఈ సమావేశంలో ఎం ఈ ఓ దయాకర్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకంలోని పాఠ్యాంశాలు ఆంగ్ల మరియు తెలుగులో ముద్రించారు, కనుక ప్రతి ఉపాధ్యాయులు విధిగా విద్యార్థికి అర్థమయ్యే విధంగా తెలుగు భాషాభివృద్ధికి మరియు ఆంగ్ల భాష బోధనకు విశేష కృషిని చేయాలని ,ప్రతి విద్యార్థులను సమగ్ర అభివృద్ధిని సాధిస్తారని, మరియు ఆంగ్ల బోధనలో ప్రత్యే కంగా నేర్చుకొని విద్యార్థి భవిష్యత్తుకు పునాదులు వేస్తారని కనుక గణితము ఆంగ్ల భాష మరియు ఇతర సభ్యులు పూర్తిగా అవగాహనతో విద్యార్థి యొక్క స్థాయిని పరిశీలించి వారు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో హాజరైన సిఆర్పి ఉపాధ్యాయురాలు సునీత, బండారుపల్లి జడ్పీ హైస్కూల్ ప్రధానఉపాధ్యాయులు నిర్మల్ కుమార్, ఉపాధ్యాయులు ఆదినారాయణ, సూర్యనారాయణ , వాసుదేవులు సిఆర్పిలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలి



ప్రజాపాలన న్యూస్ శ్రీకాళహస్తి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పేడులో బుదవారం జరుగుతున్న ప్రాథమిక స్థాయి పాఠశాలల సముదాయ సమావేశాలను మండల విద్యాశాఖాధికారి2 ఎ.దయాకర్ సందర్శించారు. ఈ సమావేశాలలో ఉపాధ్యాయులను ఉదేశించి ఎ.దయాకర్ గారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భాషా సామర్ధ్యాలను,గణితం లో ని మెళుకువలు నేర్చుకుని చదవడం రాయడం తప్పకుండా నేర్చుకుని ఉండాలని,విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఉపాధ్యాయుడు కీలకమై ఉత్తమ భోధనా పద్దతులలో మెరుగైన విద్యాబోధన అందించాలని ఆంగ్ల,తెలుగు రెండు మాధ్యమాలలో పాఠ్య పుస్తకాలు ముద్రణ జరిగి ఉన్నాయి కనుక విద్యార్థులను భవిష్యత్తులో ఆంగ్ల మాధ్యమంలో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత కూడా ఉపాధ్యాయులదే అని తెలియజేస్తూ సమావేశాలు జరుగుతున్న తీరుని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ ఈ సమావేశాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమం లో సి.ఆర్.సి ప్రధానోపాధ్యాయులు సునీత, బండారుపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నిర్మల్ కుమార్ ,విషయ నిపుణులు ఆదినారాయణ,సూర్యనారాయణ, జె.యస్,ఉపాధ్యాయులు, సి, ఆర్,పి లు పాల్గొన్నారు.

## వివాహిత మహిళ అదృశ్యం



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి ఆగస్ట్ 30: భీమిలిలో మహిళ అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు. కే మౌనిక వయస్సు 24 ఎంబీఏ చదువుతుంది. ఎన్ రాజశేఖరరెడ్డి భర్త ఇచ్చిన పిర్యాదు వివరాలు వివాహం అయ్యి 4 నెలలు అయ్యి తగరపువలస ఆదర్శనగర్ నివాసం ఉంటూ చదువుతుంది అని కాలేజ్ కి వెళ్లి వస్తానని ఇంక తిరిగి రాలేదని భర్త ఇచ్చిన పిర్యాదు పై కేసు నమోదు చేసి హరీష్ ఎస్ ఐ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు భీమిలి పోలీసులు తెలిపారు.

# అగ్రకులానికి చెందిన వ్యక్తి బొమ్మనీ 100 రూపాయల నాణెం పై ముద్రించడం న్యాయమా ?



పల్నాడు జిల్లా. నరసరావుపేట .ఆగస్టు 30 (ప్రజాపాలన ప్రతినిధి.):స్వాతంత్ర భారతావనికి దశ ,దిశ చూపిన మేధావి, బడుగు బలహీన వర్గాల తలరాతనే మార్చిన రాజ్యాంగ నిర్మాత , రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఆర్థికవేత్త , దేశానికే అమూల్యమైన సేవలు అందించిన జాతీయ నాయకులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతికి నివాళిగా,భావితరాలు ఆయనను గుర్తుంచుకునే విధంగా ,ఆయన గొప్పతనాన్ని చాటేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలని ఆంధ్ర ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కాల్వ రవి అన్నారు. మంగళవారం కాల్వ రవి విలేకరులతో మాట్లాడుతూఆంధ్ర ఎమ్మార్పీఎస్ మరియు అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ గత 12 సంవత్సరాలుగా అంబేద్కర్ బొమ్మని భారత కరెన్సీ పై ముద్రించాలని అలుపెరగని పోరాటం చేస్తున్నా, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిన కేంద్ర ప్రభుత్వం , ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన అగ్రకులానికి చెందిన వ్యక్తి బొమ్మనీ 100 రూపాయల నాణెం పై ముద్రించడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల మనోభావాలు దెబ్బతీసిన ఈ చర్యకు విచారం వ్యక్తం చేస్తున్నాం .భారతమాత తలరాతనే మార్చిన ప్రపంచ మేధావి పై వివక్షత చూపటం ఆయన అగౌరపరచడమే అవుతుంది. భారత కరెన్సీ పై అగ్రకుల నాయకుల బొమ్మలే పరిమితమా! ఓట్లు మావి, అసెంబ్లీ,పార్లమెంట్ సీట్లతోపాటు కరెన్సీ నోట్లపై కూడా బొమ్మల మీవా! ఎంత అన్యాయం , బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై ఎంతటి కుహనా రాజకీయం.అర్హతే లేని అగ్రకులానికి చెందిన వ్యక్తి పై చూపించే అభిమానం, దేశానికి వన్నెతెచ్చిన జాతీయ నాయకులైన అంబేద్కర్ పై లేకపోవడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం. దళిత మేధావులారా .. అంబేద్కర్ వాదులారా...ఇప్పటికైనా కళ్ళు తెరవండి, సిగ్గుతో తలదించుకునే రోజు ఈరోజు. ఇప్పటికీ ఆలోచన చెయ్యకపోతే అంబేద్కర్ పేరు చెప్పుకొని బ్రతికే మనం, బ్రతికిన ఒకటే. చచ్చిన ఒకటే .. కావున అంబేద్కర్ బొమ్మని భారత కరెన్సీ పై ముద్రించే విధంగా మనమందరం ఏకమై ,ఒక మహాలోకమై, ఏక తాటి పై నడిచి , మన ఏకైక లక్ష్యాన్ని సాధించాలని మిమ్ములను కోరుతూ, తద్వారా కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం నేర్పాలని మీ అందరికీ పేరు పేరున పిలుపునిస్తున్నాను... కాల్వ రవి , ఆంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ చైర్మన్ ,ఆంధ్ర ప్రదేశ్ అని అన్నారు.

## జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఇంటికి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి.:జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో సీఎం జగన్మోహన్ రెడ్డి రాక తో అక్కడ సందడి వాతావరణం నెలకొంది ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కుమార్తె వివాహ వేడుకకు బుధవారం ఉదయం తాడేపల్లి నుంచి హెలికాప్టర్లో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు నివాసమైన ఇర్రిపాక చేరుకొని నూతన వధూవరులను ఆశీర్వదించిన సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇర్రిపాకలోని చంటిబాబు నివాసంలో జరిగిన వివాహ వేడుకలో నూతన వధూవరులు పద్మశ్రీ అన్నపూర్ణ, సాయి ఆదర్శ్‌లను ఆశీర్వదించిన సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు, అభిమానులకు అభివాదం చేసి నమస్కరించి తాడేపల్లి తిరుగుపైనమయ్యారుఈ కార్యక్రమంలో భాగంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యే లు,ఉన్నతాధికారులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు


## మహిళా సంక్షేమం టిడిపితోనే సాధ్యం

మల్లేపల్లి లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ మహిళా చైతన్య రథయాత్ర



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి : కాకినాడ జిల్లా గండేపల్లి ఆగస్టు 30: గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆదేశాలతో గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహన్ రావు ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ మహిళల చైతన్య రథయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మహాశక్తి చైతన్య రథయాత్ర కమిటీ డాక్టర్ పాలూరి బోసు బాబు, దాపర్తి సీతారామయ్య, కంచుమర్తి రాఘవ హాజరై గ్రామంలో మహిళలతో ఇంటింటికీ తిరిగి ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ 1500/- లు, తల్లికి వందనం కింద చదువుకునే పిల్లలు అందరికి సంవత్సరానికి రూ 15000/- లు, దీపం పథకం కింద సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ లు ఉచితం, అదే విధంగా జిల్లా పరిధిలో బస్సు ప్రయాణం ఉచితం తదితర సంక్షేమ పథకాలు తెలుగుదేశం పార్టీ అధికారం వచ్చిన మొదటి వంద రోజుల్లోనే ప్రవేశపెడుతుంది అని, కాబట్టి వచ్చే 2024 ఎన్నికల్లో చంద్రబాబుని ముఖ్యమంత్రిని గా జ్యోతుల నెహ్రూ ను ఎమ్మెల్యేగా చేసుకోవాలనిప్రచారం నిర్వహించారు. సైకో పోవాలి - సైకిల్ రావాలి అని నినాదాలు చేసారు.ఈ కార్యక్రమంలో కొత్త కొండబాబు, క్లస్టర్ ఇన్చార్జిలు అడబాల భాస్కరరావు, సుంకవిల్లి రాజు, పోసిన ప్రసాద్, దిడ్డి శ్రీను, కాటేపల్లి భద్రరావు, చింతపల్లి భద్రరావు, తెలగ రెడ్డి ప్రకాష్, కొల్లు త్రిమూర్తులు, తెలగ రెడ్డి వీరభద్రరావు, తిప్పన సత్యవతి, పోలినాటి ధర్మానందకుమారి, నక్కిరెడ్డి సూర్యవతి, గుమ్మల్ల అనంతలక్ష్మి, గొల్లవిల్లి శ్రీదేవి, ఎల్లాటి అమ్మాజీ, గెద్దాడ సత్యవేణి, రాపాక లక్ష్మి, చెక్క మరియా, గుండుపల్లి సుజాత, గొల్లవిల్లి వరలక్ష్మి, తెలుగుదేశం పార్టీ అభిమానులు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జిల్లేపల్లి మైథిలికి తెలుగు భాషా వారోత్సవాలలో ప్రథమ బహుమతి వరించింది



నందిగామ ఆగస్టు 30 ప్రజా పాలన ప్రతినిధి తెలుగు భాషా వారోత్సవాలలో భాగంగా రుద్రవరం ఎం పియు పి స్కూల్ చెందిన జిల్లేపల్లి మైథిలి పోతన నన్నయ పద్యాలను ఆలపించినది వీటిలో పోతన పద్యాలకు గాను జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి తుమ్మలప ల్లి కళాక్షేత్రంలో అందుకున్నదని పాఠశాల ప్రధానోపా ధ్యా యురాలు రజిని తెలిపారు ఈ అవార్డు సాధించి న సందర్భంగా ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర బృం దం బాలికను అభినందించారు.

## దస్తావేజు లేఖరుల పెన్ డోన్ కు జై భీమ్ భారత్ పార్టీ మద్దతు




పల్నాడు జిల్లా. సత్తెనపల్లి. ఆగస్టు 30 (ప్రజాపాలన ప్రతినిధి): రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం డిజిటల్ ఆన్లైన్ విధానాన్ని తీసుకొచ్చి దస్తావేజు లేఖరుల పొట్టకొట్టే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తుందని ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలి లిజై భీమ్ భారత్ పార్టీ(జేబీపీ) పల్నాడు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ డిమాండ్‌లి చేశారు. పల్నాడు జిల్లా లిసత్తెనపల్లిలి రిజిస్టర్ కార్యాలయం ఆవరణలో దస్తావేజు లేఖరుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ లిబుధవారంలి చేపట్టిన లిపెన్ డౌన్‌లి లిశిబిరాన్నిలి సందర్శించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తీసుకొచ్చిన విధానం వలన ప్రజల ఆస్తులకు భద్రత ఉండదన్నారు. దీనికీ తోడు దస్తావేజు ఒరిజినల్ కాకుండా నకల్లు తోపాటు ఆధార్ కార్డ్ లో ఫోటోనే ముద్రిస్తారని చెప్పారు. దస్తావేజు నకళ్లు ఇవ్వటం వలన రైతులు, ప్రజల ఆర్థిక అవసరాలకు బ్యాంక్ కు వెళ్తే రుణాలు కూడా ఇవ్వరని తెలిపారు. బ్రిటీష్ కాలం నుండి ఉన్న రిజిస్ట్రేషన్ విధానాన్ని ఈ విధంగా మార్చడం ఏంటని ఆయన ప్రశ్నించారు. డిజిటల్ విధానం కొనసాగితే రాష్ట్ర రాష్ట్ర వ్యాప్తంగా వేల మంది దస్తా దస్తావేజు లేఖరుల ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారన్నారు. కనుక ప్రభుత్వం ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలని సూచించారు. తొలుత దస్తావేజు లేఖరులు సంఘం నాయకులు భృగుబండ్ల మల్లేశ్వరావు, చింతపల్లి కోటేశ్వరరావు, బేశాల బాలకృష్ణ, గొర్రెపాటి వెంకటేశ్వరావులకు పూల మాల వేసి శిబిరానికి మద్దతు ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాతంగి సుధాకర్ రావు, నాయకులు జడ కమల్ కుమార్, మాలే పద్మారావు, మాలపాటి దేవరాజ్, మహంకాళి వెంకట్రావ్, దాసరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఏ పి ఓ అప్పల కొండ ను పరామర్శించిన ఎంపీడీవోలు



గోకవరం ఆగస్టు 30 ప్రజా పాలన: ఇటీవల రాజమండ్రి లాలాచెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అత్రేయ పురం ఏ పి ఎం కుమారుడు అల్లాడి శ్యాంసన్ మృతి చెందాడు ఆ బాధలో ఉన్న ఆత్రేయ పురం వెలుగు ఎ పి ఎమ్ బత్తిన అప్పల కొండ కుమారుడు ను పరామర్శించిన ఎంపిడివోలు కె రత్న కుమారి, నాతి బుజ్జి లు. రంప ఎర్రం పాలెం లో ఏ పి ఓ స్వగృహం వద్ద ఈరోజు కడియం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే రత్నకుమారి, ఆత్రేయ పురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాతి బుజ్జి లు పరామర్శించారు. అనంతరం ఆ ధైర్య పడవద్దని మేమంతా నీకు అండగా ఉన్నామని ఆమెను ఎంపీడీవో లు కె రత్న కుమారి, నాతి బుజ్జి లు ఓదార్చారు. అదేవిధంగా కోరుకొండ కడియం ఆత్రేయపురం మండలాలకు సంబంధించిన వెలుగు సిబ్బంది యానిమేటర్లు రంప ఎర్రంపాలెం లోని ఏపీవో అప్పలకొండ ఇంటికి చేరుకుని ఎ పి ఓ అప్పల కొండ ను ఓదార్చారు. కోరుకొండ మండలాల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలోని పాస్టర్లు ఏ పీ ఓ అప్పల కొండ ను పరామర్శించి ఓదార్చారు పాస్టర్ ఆధ్వర్యంలో ఉషా కుమార్ లాజరస్ ఆధ్వర్యంలోనే పాస్టర్లు ఏ పీ ఓ అప్పల కొండను పరామర్శించి ఓదార్చారు వారిలో ఉన్నారు. గ్రామ సర్పంచ్ బాదంపూడి హర్షిత ప్రకాష్ ఆధ్వర్యంలోని మాజీ సర్పంచ్ రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి ఉంగరాల రాము గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సత్యం పెద్దబ్బులు, తెలుగుదేశం పార్టీ నాయకులు నారా ప్రసాద్ తదితరులు ఏపీవో అప్పలకొండ పరామర్శించి తమ సంతాపన్న తెలిపారు.

## సుందరమ్మ సత్రం భూములకు తక్షణమే బహిరంగ వేలం పాట నిర్వహించాలి: కర్నాకుల





గోకవరం ఆగస్టు 30 ప్రజాపాలన: వేలంపాటలో పాడుకుని డబ్బులు కట్టని భూములకు తక్షణమే వేలంపాటలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గోకవరం మండలం రంప ఎర్రంపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి దేశెట్టి సురేష్ మాట్లాడుతూ సుందరమ్మ సత్రం భూములు వేలంపాటలు నిర్వహించడంలో ఎండోమెంట్ అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లోనై కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. గతంలో రైతు కూలీ సంఘం పోరాడగా కొంత భూమిని వేలంపాటలు నిర్వహించారని, ఆ వేలంపాటలు నిర్వహించినప్పుడు వేలంపాటలో భూమి దక్కించుకున్న వారు ఒక సంవత్సరం శిస్తూ ముందుగా చెల్లించాలని, చెల్లించలేని పక్షంలో ఆ భూమిని మరల వేలంపాటలు నిర్వహిస్తామని, ఎండోమెంట్ అధికారులు నిబంధనలు పెట్టారన్నారు. కానీ నిబంధనలు పెట్టిన అధికారులే అధికార, ప్రతిపక్ష నాయకుల ఒత్తిళ్లకు లోనై కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే వేలంపాటలో పాడుకుని శిస్తు చెల్లించని 21 ఎకరాలు మరియు పెండింగ్లో ఉన్న 16 ఎకరాలు మొత్తం 37 ఎకరాలకు భూములకు బహిరంగ వేలంపాటలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎండోమెంట్ అధికారుల నిర్లక్ష్య వైఖరి పై జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుడిసె చెల్లారావు గోలి ముసలయ్య కడవల అప్పారావు,వడ్లపాటి వెంకటలక్ష్మి,పిడిఎస్యు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## కాలువ పూడికతీత పనులను ప్రారంభించిన ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



వత్సవాయి ఆగస్టు 30 ప్రజా పాలన ప్రతినిధిమండ లపరిధిలో నందిగామ బ్రాంచ్ కెనాల్ చిల్లకల్లు మక్క పేట కెనాల్ వద్ద మరియు పెనుగంచిప్రోలు మేజర్ చి ట్యాల మైనర్ గోపినేనిపాలేం కెనాల్ వద్ద పుడికితీత పనులు మరియు జంగిల్ క్లీనింగ్ పనులను బుధవా రం నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వవిప్,జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయ భాను ప్రారంభించారుఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్త కుండా చూడాలని అన్నారు.నందిగామ బ్రాంచ్ కెనా లపై సుమారు నాలుగు కిలోమీటర్లు మేర 5.50 లక్షల రూపాయలతో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టామ న్నారు.ప్రాధాన్యత క్రమంలో అన్ని కాలువలను అభి వృద్ధి చేస్తామని అన్నారు.మునేటి ఆయకట్టు కింద ఉ న్న రైతులు ధైర్యంగా సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ త న్నీరు నాగేశ్వరరావు,ఎంపీపీ కొలుసు రమాదేవి, జడ్పి టిసి యేసుపోగు దేవమణి,గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు,సొసైటీ అధ్యక్షులు,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జి ల్లా ఉపాధ్యక్షులు చింతకుంట్ల వెంకటరెడ్డి,డిసి మాజీ ఉపాధ్యక్షులు గుంటుపల్లి వాసు,ఈ ఈ సంతోష్ ,డి ఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లా ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు



పల్నాడు జిల్లా .నరసరావుపేట. ఆగస్టు 30 (ప్రజాపాలన ప్రతినిధి.): మొదటి విడత ఎన్నికల మ్యానిఫెస్టోలో లో భాగంగా మహాశక్తి పథకాన్ని ప్రకటించిన మాజీ ముఖ్యమంత్రి వర్యులు మరియు జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు .మహిళా సాధికారత, భద్రతకు ప్రాధాన్యం ఇచ్చే పార్టీ టీడీపీనే మీకు ఎల్లప్పుడూ అన్నలా అండగా ఉంటామని తెలియజేస్తూ. లిపల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మరియు వినుకొండ మాజీ శాసనసభ్యులు జి.వి.ఆంజనేయులు .

## సారా 20 లీటర్లు స్వాధీనం.. ఇద్దరు వ్యక్తుల అరెస్టు



గోకవరం ఆగస్టు 30. ప్రజా పాలన: మండలం కామరాజుపేట గ్రామంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది జరిపిన తనిఖీల్లో 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం ఇద్దరు వ్యక్తులు అరెస్ట్ చేసామని తెలిపారు. గ్రామంలో నాటు సారా తయారు చేస్తున్నారని ఎక్సైజ్ సిబ్బందికి అందిని సమాచారం మేరకు ఎక్సైజ్ సిఐ జి. సత్యనారాయణ వారి సిబ్బంది కామరాజుపేట గ్రామ శివారులో జరిపిన తనిఖీల్లో నాటు సారా తయారు చేస్తున్న బట్టిపై దాడి చేసి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం. 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊట కుండల ను పగలకొట్టడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిబ్బంది నాటు సారా తయారీ అమ్మకాలు సాగిస్తున్న జీడి. సింహాద్రి, గుత్తుల చంద్రమ్మ అనే ఇద్దరు వ్యక్తులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎక్సైజ్ సిఐ జి. సత్యనారాయణ తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయ రైతులు ఏటీఎం మోడల్ విధానంలో పంటలను సాగు చేయాలి



పల్నాడు జిల్లా. నరసరావుపేట. ఆగస్టు 30. (ప్రజాపాలన ప్రతినిధి. )ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్న రైతులు ఏటీఎం మోడల్ విధానంలో పంటలను సాగు చేయటం వలన రైతులకు ఖర్చు తగ్గి దిగుబడులు మరియు ఆదాయాలు సమకూరుస్తాయని పలనాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమల కుమారి అన్నారు. బుధవారం నకరికల్లు మండలం గుండ్ల పల్లి గ్రామంలోని కోపూరు గోపి వేసినటువంటి ఏటీఎం మోడల్, పంట పొలాన్ని పరిశీలించారు. అధికారులకు రైతు వేసినటువంటి 20 సెంట్లు ప్రధాన పంటగా క్యారెట్ బీట్రూట్, ముల్లంగి పంటలను సాగు చేస్తూ అదే విధంగా పంటల మధ్య భాగంలో తోటకూర, పాలకూర చుక్కకూర, ఆకుకూరలు గట్ల చుట్టు రక్షణ పంటగా జొన్న సజ్జ, అదేవిధంగా తీగజాతైన దోస ,బీర ,బెండ, చిక్కుడు టమాట, కంది పంటలను వేయడం జరిగిందని, ఒక్క పంట కాకుండా అనేక పంటలు వేసి సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయటం వలన రైతుకు సంవత్సరం పాటు పంట దిగుబడును తీసుకొని ఆదాయాలు పొందవచ్చని రైతు తెలియపరిచారు. ఈ సందర్భంగా రైతు సోదరులందరూ ఈ పద్ధతుల్లో పంటలను సాగు చేసి అధిక లాభాలు పొందాలని ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో రసాయనాలు వీడి సేంద్రియ విధానంలో పంటలను సాగు చేస్తే రైతన్న కుటుంబాలు సంతోషంతో కళకళలాడుతారని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమల కుమారి అన్నారు. ఈ కార్యక్రమంలో మెంటర్స్ నరసింహారావు, శివా నాయక్, రైతు శాస్త్రవేత్తలు,ఐ సి ఆర్ పి పురుషోత్తం,ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

## నూతన అర్బన్ సిఐని కలిసిన పాత్రికేయులు దళిత ప్రజా సంఘాల నాయకులు



బద్వేలు, ప్రజాపాలన ప్రతినిధి : కడప జిల్లా బద్వేలులో అర్బన్ పోలీస్ స్టేషన్ సిఐ గా బాధ్యతలు చేపట్టిన యుగంధర్ ని బద్వేల్ పట్టణ పాత్రికేయులు, దళిత ప్రజాసంఘాల నాయకులు కలిసి పూలమాలలు , శాలువాతో ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దళితుల సమస్యల పట్ల సరైన న్యాయం జరగాలని వారు ఆయనను కోరారు. ఆయన స్పందిస్తూ దళితుల సమస్యల పట్ల సిద్ధ శుద్ధిగా, నిజాయితీగా వాళ్ళ సమస్యలను పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూలే అంబేద్కర్ రాజ్యాధికారి సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ముండ్ల పాటి పిచ్చయ్య, దళిత హక్కుల పోరాట సమితి కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటరమణ, దళిత సీనియర్ నాయకులు తలారి రత్నం, ఓఎస్పి ప్రసాద్ విలేకరులు స్నేహ టీవీ విలేకరి లక్కినేని వినయ్ కుమార్, మన తెలుగు విలేకరి వెంకటసుబ్బయ్య, ఏఆర్ ఫైవ్ రిపోర్టర్ రామచంద్రయ్య, ప్రజా పాలన విలేఖరి ఓబయ్య, డి హెచ్ పి ఎస్ నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో సబ్ రిజిస్ట్రార్ దస్తావేజు లేఖర్ల సంఘం నిరసన



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి :కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరులు ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇటీవలే ప్రభుత్వం నూతన విధానంలో ప్రవేశపెట్టిన ప్రైమ్ 2.0 విధానం వల్ల ప్రజలు, దస్తావేజు లేఖరులు,సహాయకులు, డాక్యుమెంట్ ఆపరేటర్లు, స్టాంపు వెన్డెర్లకు ఎంతో నష్టపోయే అవకాశం ఉందని నిరసన చేపట్టారు. తక్షణమే ప్రభుత్వం ఈ విధానాన్ని విరమించుకొని బ్రిటిష్ కాలం నాటి నుండి కొనసాగుతున్న పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖరులు రెండు రోజులపాటు చేపడుతున్న ఈ నిరసనలో భాగంగా ప్రత్తిపాడు లేఖలు మొదటి రోజు పెన్డౌన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు పంచదార్ల నాగేశ్వరరావు,అత్తి ఉమామహేశ్వరరావు,ఇర్లంకి రాంబాబు,చిలకమర్తి వెంకటరమణ, చిలకమర్తి భాస్కరరావు,పంచదార్ల రాంబాబు,రాయవరపు హనుమంతరావు,అనిశెట్టి బెన్నయ్య దొర, సభ్యులు మదినే దొరబాబు, సింగిలిదేవి బాబ్జి,మణికంఠ స్వామి, భీమిరెడ్డి చంటి,గల్లా మధు,లక్ష్మణ్,భారతి, వెంకటరమణ,గిరి,రమేష్, నాగేశ్వరరావు, శ్రీను,సుందరి, తదితరులు ఆందోళన చేపట్టారు.

## కాట్రావులపల్లి లో ఇండియా వన్ ఏటీఎం ప్రారంభించిన కొత్త కొండబాబు



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి :కాకినాడ జిల్లా జగ్గంపేట ఆగస్టు 30: జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో ఇండియా వన్ ఎటిఎం ప్రారంభించిన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి, జగ్గంపేట మండలం వినియోగదారుల ఫోరం కన్వీనర్, అన్నవరం దేవస్థానం మాజీ టెస్ట్ బోర్డు సభ్యులు, జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షులు కొత్త కొండబాబు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాట్రావులపల్లి గ్రామ ప్రజలకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అందుబాటులో ఏటీఎం ప్రారంభించడం జరిగిందని దీనివల్ల గ్రామీణ రైతులకు, వ్యాపారస్తులకు, వినియోగదారులకు అందుబాటులో ఏటీఎం సేవలో వినియోగించుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియా వన్ ఏటీఎం జోనల్ మేనేజర్ ఎస్. రవికుమార్, సర్పంచ్ పిట్టా సుగుణ రావు, కొత్త ప్రకాష్, కొత్త శ్రీను, కొత్త శివకుమార్, వినియోగదారులు పాల్గొన్నారు.

## హాస్టల్ ఇన్చార్జిల విషయంలో కాలయాపన చేస్తు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రెగ్యులర్ వార్డెన్‌లను నియమించాలి: డి యస్ యఫ్




ఆదోని ప్రజాపాలన ప్రతినిధి : ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధనాపురం ఉదయ్ మాట్లాడుతూ ఒకే వార్డెన్ రెండు ముడు హాస్టల్ కి ఇంచర్జ్ ఇవ్వకుండాగా స్థానికంగా ఉండే ప్రభుత్వ స్కూల్ హెడ్మాస్టర్ కు ఇంచర్జ ఇవ్వాలిలి ఈరోజు ఆదోని డివిజన్ లో రెండు మూడు హాస్టళ్లకు ఇన్చార్జీలు ఇస్తూ విద్యార్థి జీవితాలతో చెలగాటమాడుతున్నటువంటి పరిస్థితి ఏర్పడింది ఎక్కడైతే హాస్టల్ ఉందా స్థానికంగా ఉండే హెచ్ఎం సార్ గారికి ఇంచార్జ్ ఇవ్వాలని విధంగా ఇవ్వటం వల్ల విద్యార్థులకు అన్ని రకాలుగా అందుబాటులో ఉంటూ వారు సమస్యలు పరిష్కరించడానికి అవకాశం ఉంటుంది డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ డి.ఎస్.ఎఫ్ విద్యార్థి సంఘం డిమాండ్ చేస్తున్నాము అలా రెండు మూడు ఇన్చార్జి ఇవ్వడం వల్ల ఒక హాస్టల్ నుండి మరొక హాస్టల్ కు వార్డెన్ వెళ్లే లోపల విద్యార్థులకు ఏదైనా జరగరాని జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని డి యస్ యఫ్ విద్యార్థి సంఘంగా అడుగుతున్నాము... ఇదే విధంగా కొనసాగితే ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని డిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థులను కలుపుకొని మరింత ఉద్యమాలకు సిద్ధమవుతామని మాట్లాడడం జరిగింది ఈ సమావేశంలో డిఎస్ఎఫ్ నాయకులు కిరణ్ సూరి విక్రమ్ అరుణ్ తేజ భాస్కర్ తదితరులు పాల్గొనడం జరిగింది

## ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా సిపిఎం అధ్వర్యంలో సమరభేరి: సి పి యమ్ ఆదోని




ఆదోని ప్రజాపాలన ప్రతినిధి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీలు, అధిక లెట్స్ వ్యతిరేకంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 30 నుండి సెప్టెంబర్ 5 వరకు రాష్ట్ర వ్యాపితంగా జరుగు నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న,సీనియర్ నాయకులు ఈరన్న, కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు వీరేష్, వెంకటేష్, నాగరాజ్, నాగేంద్ర, తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై సిపిఎం సమరభేరి కరపత్రాలు, పోస్టర్లను సుందరయ్య భవన్ నందు విడుదల చేయడం జరిగింది. అలాగే పట్టణంలో అంబేద్కర్ నగర్, కార్వన్ పేట, ఇందిరానగర్, మండగిరి, ఎస్ కే డి కాలనీ, షేరా?న్ కుట్టాలు, తదితర ఏరియాలలో కరపత్రాలు పంపిణీ చేస్తూ, సంతకాలు సేకరణ చేయడం జరిగింది. కార్యక్రమం ఉద్దేశించి మీరు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని వారు తెలిపారు. కేంద్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు, రాయితీలు ఇస్తూ పేద ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతుందని వారు తెలిపారు. ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతూ, ప్రభుత్వాలు వేస్తున్న ఈ బారాలకు వ్యతిరేకంగా, దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తు చేసి, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, అధిక ధరలను అదుపు చేయాలని, సరసమైన ధరలకు నిత్యవసరాలు అందించాలని, కరెంటు చార్జీలు తగ్గించాలని, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిందని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామానాయుడు, అంజి, శివ, రామంజి, మెహన్,భీమా తదితరులు పాల్గొన్నారు.

## జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి రాఖీ కట్టి వేడుకలు నిర్వహించుకున్న వైకాపా మహిళలు



ప్రజాపాలన న్యూస్ శ్రీకాళహస్తి : రాఖీ కట్టిన సోదరీమణులకు స్వీట్ బాక్స్ చీరలను బహుమతిగా అందజేసిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి గారు మాట్లాడుతూ..రాఖీ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి చిత్రపటానికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపిన మహిళలకు బహుమతిగా స్వీట్ బాక్స్ చీరలను బహుమతిగా అందజేశామని రామరాజ్యం లాంటి జగనన్న పరిపాలనలో మహిళలకు అనేక సంక్షేమ పథకాలతో మహిళలను అభివృద్ధి పరుస్తూ మహిళ సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డి పరిపాలన చేస్తున్నారని, ఇంతటి మహోన్నతుడైన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి మహిళల యొక్క ఆశీర్వాదం ఎల్లవేళలా ఉండాలని కోరారు. శ్రీపవిత్ర రెడ్డి మాట్లాడుతూ.. 'మా అన్నయ్య సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కి రాఖీ శుభాకాంక్షలు తెలియజేశామన్నారు. మహిళల భద్రత కోసం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారు. మహిళల కోసం అనేక అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టారు. రాఖీ పండగ సందర్భంగా మహిళల భద్రతకు మరో అడుగు ముందడుగు వేసి, దిశ



చట్టాన్ని తీసుకురావడం ద్వారా మహిళల పై ఎంత గౌరవం ఉందో తెలుస్తోంది. మహిళలకు 50 శాతం హక్కు కల్పించడమే కాకుండా, ఓ మహిళకి హెూంమంత్రి పదవి ఇచ్చారు. ఎస్టీ మహిళకు డిప్యూటీ సీఎం పదవి కల్పించారు ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డి కి మహిళలపై ఉన్న గౌరవానికి ఇది నిదర్శమని అన్నారు. రక్షబంధన్ సందర్భంగా జగనన్న ఉన్నాడనే భరోసాతో మహిళలు భద్రతగా, గౌరవంగా బయటకు వచ్చి ఆత్మగౌరవంతో బతుకుతున్నామని. జగనన్న ఉన్నాడనే భరోసా ఇలాగే మరో 30,40 సంవత్సరాలు జగనన్నే ముఖ్యమంత్రి గా ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ మహిళలు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రతి అక్కకు,చెల్లెమ్మకు రాఖీ శుభాకాంక్షలు తెలిపిన బియ్యపు మధుసూదన్ రెడ్డి



ప్రజాపాలన ప్రతినిధి శ్రీకాళహస్తి :రాఖీ పౌర్ణమి సందర్భంగా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి మహిళా లోకానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి అక్కకు, ప్రతి చెల్లెమ్మకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలుపుతూ రాఖీ కట్టించుకొని వారిని ఆశీర్వదించి, వారు చూపుతున్న ప్రేమాభిమానాలకు సదా కృతజ్ఞతుడినని అన్నారు. మహిళల సంక్షేమమే లక్ష్యంగా.. వారి రక్షణే ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తున్నారని తెలిపారు. అలాగే ఒక అన్నగా,ఒక తమ్ముడిగా మీకు ఏ సమస్య వచ్చినా ఎప్పుడూ అండగా ఉంటానని మాట ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళలు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన రేణిగుంట విమానాశ్రయ అధికారులు



ప్రజాపాలన న్యూస్ రేణిగుంట : రేణిగుంట విమానాశ్రయానికి సంబంధించి చాలా కాలం నుండి పెండింగ్ లో ఉన్న 3.40 ఎకరాల భూమిని జిల్లా యంత్రాంగం ఏర్పోర్ట్ అథారిటీకి తిరుపతి ఇంటర్నేషనల్ విమానాశ్రయ విస్తరణకు అప్పగించిన నేపథ్యంలో రేణిగుంట విమానాశ్రయ అధికారులు ఎయిర్పోర్ట్ డైరెక్టర్ బసవరాజు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రాజశేఖర్, డిజిఎం ఏర్పోర్ట్ వెంకటరమణ సంయుక్తంగా నేటి బుధవారం జిల్లా కలెక్టర్ కె వెంకట రమణా రెడ్డి, జెసి డీకే బాలాజీ కలిసి వారి సేవలను, కృషిని అభినందిస్తూ పుష్ప గుచ్చాలు అందచేసి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం





ఏర్పేడు ప్రజా పాలన న్యూస్. ఏర్పేడు మండలం మేర్లపాక గ్రామ పంచాయతీలో నారాయణద్రి హాస్పిటల్ మరియు వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మేర్లపాక సర్పంచ్ కే .గంగాధర్ ఆధ్వర్యంలో ఉచితంగా గ్రామస్తులకు వివిధ రకాల రోగాలకు బీపీ, షుగర్ , జ్వరం ,దగ్గు, జలుబు, కాళ్లు నొప్పులు ,దృష్టిలోపం ఉన్న యెడల వారికి వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వారు వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వారు జనరల్ చెకప్ నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి అశేష జనం వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని మందులను తీసుకున్నారు. ఈ వైద్య శిబిరంలో వాసన్ ఐ కేర్ క్యాంప్ ఇంచార్జ్ మస్తాన్ , తులసి సాయి పూజ ,సంధ్య, టెక్నీషియన్స్ కృష్ణ మరియు నారాయణాద్రి హాస్పిటల్ క్యాంప్ ఇంచార్జ్ వెంకటేష్ , డాక్టర్ పూర్ణచంద్ర పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి సహకరించిన వారిలో సర్పంచ్ కె. గంగాధర్ ,ఎంపీటీసీ భరత్ కుమార్, సింగమల సుబ్రమణ్యం, కండి సురేంద్ర, ఈశ్వరయ్య, చంగల్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతి



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: కీర్తిశేషులు మాజీమంత్రి వర్యులు పెనుకొండ మాజీ శాసనసభ్యులు అణగారిన వర్గాలకు న్యాయంచేసేందుకు పోరాడినయోధుడు , ప్రజల మధ్య లేకున్నా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన పరిటాల రవీంద్ర జయంతి సందర్భంగా పెనుకొండ లోని కార్యాలయం నందు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ సీనియర్ టిడిపి నాయకులు మాధవ నాయుడు మాజీ జడ్పిటిసి వెంకటరమణ మాజీ సింగల్ విండో అధ్యక్షులు డివి ఆంజనేయులు మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు గుట్టూరు మాజీ సర్పంచ్ సూర్యనారాయణ మాజీ సర్పంచ్ నంజప్ప గుడిపల్లి మాజీ సర్పంచ్ రంగప్ప త్రివేంద్ర నాయుడు,మాజీ వైస్ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, పెద్దపల్లి శ్రీరామ్ రెడ్డి మారుతి ప్రసాద్ మీ సార్ సనావుల్లా దాదు ఫయాజ్, కౌన్సిలర్ గీతా హనుమంతు గొల్లపల్లి చంద్ర, వాసుదేవ రెడ్డి,ముత్యాల యాదవ్ మద్దిలేటి, రాము ప్రశాంత్, రాజేష్,మూర్తి తదితరులు.

## దేవినేని ఉమా హౌస్ అరెస్ట్



విజయవాడ : మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావు ను పోలీసులు బుధవారం హౌజ్ అరెస్టు చేసారు. మంగళవారం అర్ధరాత్రి నుండి అయన గొల్లపూడి ఇంటి దగ్గర పోలీసులు పహారా కాస్తున్నారు. రాష్ట్రంలో అధికార పార్టీ ఇసుక దోపిడీకి పాల్పడుతోందని ఆరోపిస్తూ తెలుగు దేశం పార్టీ నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ఇసుక దోపిడీపై 28,29,30 తేదీలలో టీడీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇబ్రహీంపట్నంలో ఉన్న డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడి, తరువాత .. వైసీపీ ఇసుక దోపిడీ గురించి టీడీపీ సేకరించిన ఆధారాలను మైనింగ్ డైరెక్టర్ కు చూపించి వైసీపీ చేస్తున్న ఇసుక దోపిడీ అరికట్టాలని వినతి పత్రాలు అందజేసే క్రమంలో అర్ధరాత్రి నుంచి గొల్లపూడి పోలీసులు ఆంక్షలు విధించారు.

## బాలయ్య "భైరవ ద్వీపం" మళ్ళీ వాయిదా!




నందమూరి నటసింహం నందమూరి బాలకృష్ణ హీరోగా ఇప్పుడు సాలిడ్ మాస్ చిత్రం "భగవంత్ కేసరి" కోసం అందరికీ తెలిసిందే. ఈ చిత్రం షూట్ లో ఇపుడు చిత్ర యూనిట్ అంతా బిజీగా ఉండగా మరో పక్క అయితే రీసెంట్ గా బాలయ్య వింటేజ్ చిత్రాలు రీ రిలీజ్ కి వస్తున్నట్టుగా కూడా కన్ఫర్మ్ అయ్యాయి. ఇక ఈ చిత్రాల్లో అయితే బాలయ్య వింటేజ్ ఫాంటసి వండర్ చిత్రం "భైరవ ద్వీపం" కూడా ఒకటి. మరి ఈ చిత్రం అయితే ఇది వరకే రిలీజ్ కావాల్సింది. ఈ ఆగస్ట్ 30న రిలీజ్ కి సిద్ధం చేయగా లేటెస్ట్ గా అయితే ఈ డేట్ నుంచి కూడా ఈ చిత్రం వాయిదా అయ్యినట్టుగా కన్ఫర్మ్ అయ్యింది. మరి దీనికి అయితే రెస్పాన్స్ సరిగ్గా రాకపోవడమే అన్నట్టు తెలుస్తుంది. దీనితో మరో మంచి డేట్ లో అయితే ఈ సినిమాని రిలీజ్ చేయనున్నారని టాక్. ఇక ఈ చిత్రానికి సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించగా రోజా హీరోయిన్ గా నటించింది.

## కొత్త సంవత్సరంలో అమీర్‌ఖాన్ కొత్త ప్రారంభం



'లాల్ సింగ్ చడ్డా' డిజాస్టర్ ఫలితం మిస్టర్ పర్ఫెక్ట్ అమీర్ ఖాన్ హృదయాన్ని తీవ్రంగా గాయపరిచింది. ఎంతో సెంటిమెంటుగా ఫీలై.. కఠోరంగా హార్డ్ వర్క్ చేసిన ఈ సినిమా అలాంటి చెత్త ఫలితాన్ని ఇస్తుందని అతడు ఊహించలేదు. అందుకే ఆ తర్వాత సుదీర్ఘ గ్యాప్ ని తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇప్పటివరకూ అమీర్ ఖాన్ తదుపరి సినిమాని ప్రకటించకపోవడానికి అతడిలోని అంతర్మథనం ఒక కారణం. ఎట్టకేలకు అన్నిటి నుంచి అమీర్ కోలుకుంటున్నారు. తన పునరాగమన ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం సహా విడుదల తేదీని లాక్ చేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అమీర్ నటించే తదుపరి చిత్రం 20 డిసెంబర్ 2024న విడుదల కానుందని తెలిసింది. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరిలో సెట్స్ పైకి రానుంది. అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ బ్యానర్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. ఇప్పటికి సినిమా వివరాలు గోప్యంగా ఉంచారు. ఈసారి మునుపటిలా కాకుండా అనవసరమైన అంచనాలు పెంచే ఉద్దేశం అతడికి లేకపోవడమే దీనికి కారణం. అయితే అభిమానులు, పరిశ్రమ ఔత్సాహికులు ప్రాజెక్ట్ వివరాలను తెలుసుకోవాలని చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే అమీర్ ఖాన్ కంబ్యాక్ ఎలాంటి ఛాలెంజ్ ని విసురుతుందో చూడాలన్న ఆసక్తి. చిత్ర పరిశ్రమలో అతడి గౌరవప్రదమైన స్థాయిని మరింతగా పెంచడంతోపాటు, చెప్పుకోదగ్గ దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించాల్సిన సందర్భమిది. షారూఖ్ పఠాన్ రేంజులో అతడు కంబ్యాక్ కావాల్సి ఉంటుంది. అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ ప్రోడక్ట్ నంబర్ 16 గా ఈ చిత్రం తెరకెక్కనుంది. ఇది పూర్తిగా యాక్షన్ సినిమానా లేక ఇంకేదైనా ప్రయోగమా? అన్నది మునుముందు తెలుస్తుందేమో.

## నాగ్ కూడా సెన్సేషనల్ కం బ్యాక్ ఇవ్వబోతున్నారా.!



నేడు టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా టాలీవుడ్ ప్రముఖులు అంతా కూడా నాగ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తుండగా వీటి అన్నిటిని మించి అక్కినేని ఫ్యాన్స్ మాత్రం తన 99వ సినిమా అనౌన్సమెంట్ తో ఫుల్ ఖుషిగా ఉన్నారు. అయితే ఇపుడు మన టాలీవుడ్ సీనియర్ హీరోస్ అంతా కూడా తమ రేంజ్ సాలిడ్ కం బ్యాక్ ని ఇప్పుడు అందుకున్నారు. ఓ పక్క బాలయ్య అఖండ తో రోరింగ్ కం బ్యాక్ అందుకోగా నెక్ట్స్ మెగాస్టార్ చిరు వాల్తేరు వీరయ్య తో అందుకున్నారు. ఇక వెంకీ మామ కూడా ఓ భారీ చిత్రాన్ని దర్శకుడు శైలేష్ కొలనుతో చేస్తున్నారు. ఇది కూడా తనకి గట్టి కం బ్యాక్ ఇస్తుంది అని ఆల్రెడీ టాక్ ఉంది. మరి ఇప్పుడు నాగ్ నుంచి ఈ చిత్రం "నా సామిరంగా" గ్లింప్స్ తో అయితే నాగ్ కూడా భారీ కం బ్యాక్ అందుకునేలా ఉన్నారని అర్థం అవుతుంది. దర్శకుడు మాస్ టేకింగ్ నాగ్ ని ఓ రేంజ్ లో ఎలివేట్ చేయడం వంటివి ఓ రేంజ్ లో అనిపిస్తున్నాయి. దీనితో నాగ్ కూడా వచ్చే పండుగకి మరోసారి సెన్సేషనల్ కం బ్యాక్ ఇవ్వనున్నారని చెప్పొచ్చు. మరి కింగ్ నాగ్ అయితే తన కెరీర్ లోనే భారీ కం అండ్ గ్రాసర్ ని దీనితో అందుకుంటారో లేదో చూడాలి.

## దుల్కర్.. తెలుగులో ఈ స్పీడేంటి బాబు!



తెలుగు ఆడియన్స్ ని ఒక్కసారి కంటెంట్ తో మెప్పించాలే గాని ఏ భాషలోనివారైనా సరే ఇక్కడ మంచి క్రేజ్ అందుకుంటూ ఉంటారు. తమిళ హీరోలకు గత కొంతకాలంగా ఏ స్థాయిలో క్రేజ్ అందుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక ఇప్పుడిప్పుడే మలయాళం ఇండస్ట్రీలో నుంచి కూడా కొంతమంది నటీనటులకు మంచి గుర్తింపు లభిస్తుంది. ఇక దుల్కర్ సల్మాన్ అయితే ఇప్పుడు సొంత భాషలో కంటే తెలుగులోనే మంచి ఆఫర్లు అందుకుంటున్నాడు. ఒక విధంగా చెప్పాలి అంటే తెలుగులోకి వచ్చిన తర్వాతనే అతని ఆదాయం కూడా పెరిగింది. ఎందుకంటే అక్కడ సొంత భాషలో తక్కువ బడ్జెట్లో లిమిట్ పారితోషకంతో సినిమాలు చూసుకుంటూ వస్తున్న దుల్కర్ సల్మాన్ కు ఇప్పుడు తెలుగులో మాత్రం అక్కడికంటే ఎక్కువ స్థాయిలో పారితోషకం ఇచ్చి సినిమా అవకాశాలు అయితే ఇస్తున్నారు. అతని నటన హ్యాండ్సమ్ లుక్స్ తెలుగు వారికి బాగా నచ్చేసాయి. మహానటి సినిమాలో అతను నటించిన విధానం చాలా బాగా హెల్ప్ అయ్యింది. ఇక ఆ తర్వాత సీతారామం సినిమా తెలుగు జనులకు మరింత దగ్గర చేసింది. ప్రస్తుతం అతను తెలుగులోనే ముగ్గురు నిర్మాతలతో సినిమాలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ప్రస్తుతం వెంకీ అట్లూరి దర్శకత్వంలో సినిమా చేస్తున్నాడు. ఇటీవల అధికారికంగా క్లారిటీ కూడా ఇచ్చారు. ఆ సినిమా షేర్ మార్కెట్ నేపథ్యంలో రాబోతోంది. అలాగే మరోవైపు ఏషియన్ సునీల్ ప్రొడక్షన్లో మరో సినిమా చేసేందుకు ఒప్పుకున్నాడు. అందులో రానా కూడా మరో హీరోగా నటించబోతున్నాడు. ఇక లిస్టులో నాగార్జునకు దగ్గర బంధువైన ప్రశాంతి నిర్మాతగా రూపొందించనున్న మరో సినిమాకు దుల్కర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఈ సినిమాను కూడా త్వరలోనే స్టార్ట్ చేయబోతున్నారు. ఇక రీసెంట్గా మరో తెలుగు నిర్మాత సుధాకర్ చేరుకురితో కూడా దుల్కర్ సల్మాన్ సినిమా చేసేందుకు అగ్రిమెంట్ చేసుకున్నాడు. కొత్త దర్శకుడు చెప్పిన కథ అతనికి బాగా నచ్చడంతో వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఈ విధంగా కొత్తగా మూడు ప్రాజెక్టులు అయితే తెలుగు నిర్మాతలతోనే చేస్తూ ఉండడం విశేషం. ఇక ఈ సినిమాలు తమిళం మలయాళం భాషల్లో కూడా యధావిధిగా విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి.

## కళ్యాణ్ రామ్ కెరీర్ బెస్ట్ స్టెప్ ఇది..!



నందమూరి హీరో కళ్యాణ్ రామ్ నిత్యం విభిన్న కథలను ఎంచుకుంటూ సత్తా చాటుతూ ఉంటాడు. అందరిలా కాకుండా, సినిమా సినిమాకీ ఏదో ఒక వేరియేషన్ ప్రయత్నిస్తూ ఉంటాడు. ఇప్పటి వరకు ఆయన చేసిన ప్రతి సినిమాలో ఏదో ఒక కొత్త దనం ప్రయత్నిస్తూనే ఉన్నాడు. గతేడాది ఆయన బింబిసార మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. ఆ తర్వాత వచ్చిన అమిగోస్ తో భిన్నంగా ప్రయత్నించాడు కానీ, పెద్దగా వర్కౌట్ కాలేదు. ఫలితం తో సంబంధం లేకుండా, ఆయన విభిన్నమైన కథలను మాత్రమే ఎంచుకుంటూ ఉంటాడు. ఎప్పటికప్పుడు ప్రేక్షకులకు కొత్తదనాన్ని పరిచయం చేయాలనే అనుకుంటూ ఉంటాడు. కొన్నిసార్లు భిన్నమైన కథల కారణంగా ఫెయిల్ అయిన సందర్భాలు ఉన్నాయి. అయినా, తన ప్రయత్నాన్ని మాత్రం ఆపలేదు. అయితే, ప్రస్తుతం ఆయన తన కెరీర్ లో సరైన మూవ్ ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. మరో లింక్ పెట్టేశారు బింబిసార సినిమాతో ఎవరూ ట్రై చేయని యాంగిల్ ని ఆయన ప్రయత్నించారు. ఇప్పుడు దానికి సీక్వెన్స్ కూడా తీస్తున్నారు. ఇది కాకుండా, ఆయన డెవిల్ అనే మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అయ్యారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా డెవిల్ మూవీ టీజర్ విడుదల చేశారు. ఇప్పుడు ఈ టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ వీడియో ఆద్యంతం గూస్ బంప్స్ ను తెప్పిస్తుంది. భారతదేశానికి స్వాతంత్ర్యం రాక ముందు బ్రిటీష్ వారి హయాంలో వాళ్ల ఏజెంట్ గా పని చేసిన ఓ వ్యక్తి కథే ఈ డెవిల్. ఈ సినిమా కథ భిన్నంగా సాగుతుందని తెలుస్తోంది. ఈ క్రమంలో ఆయన వచ్చే సినిమాలన్నీ డిఫరెంట్ జోనర్లో సాగుతున్నాయని తెలుస్తోంది. ఒకే జోనర్ కి స్టిక్ అవ్వకుండా, డిఫరెంట్ జోనర్లు ప్రయత్నిస్తూ, తన కెరీర్ ని అద్భుతంగా మలుచుకుంటున్నారు. కరెక్ట్ టైమ్ లో కరెక్ట్ పాత్ ని ఎంచుకుంటూ ఆయన తన కెరీర్ ని మలుచుకుంటున్న విధానం అందరికీ నచ్చుతుంది. ప్రేక్షకులకు ఎప్పుడూ కొత్త దనం అందించాలనే ఆయన ప్రయత్నాన్ని చూసే వారు కూడా ఆదరిస్తే, ఆయనకు విజయాలు కూడా దక్కుతాయి. విజయాలు దక్కినప్పుడే, కొత్తగా ఏదైనా చేయాలనే ఉత్సాహం కూడా పెరుగుతుంది. మరి, ఆయన అప్ కమింగ్ ప్రాజెక్ట్స్ ఎంత వరకు విజయం సాధిస్తాయో, ప్రేక్షకులు ఎంత మేర ఆదరిస్తారో చూడాలి.

## యూఎస్ లో "లియో" కి రికార్డు బిజినెస్.!



ఇళయ దళపతి విజయ్ జోసెఫ్ హీరోగా త్రిష హీరోయిన్ గా దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన అవైటెడ్ చిత్రం "లియో" కోసం అందరికీ తెలిసిందే. మరి చిత్రంపై సెన్సేషనల్ హైప్ నెలకొనగా ఈ చిత్రం దసరా కానుకగా మేకర్స్ రిలీజ్ చేస్తుండగా ఈ సినిమా బిజినెస్ అయితే జరుపుతున్నట్టుగా ఆల్రెడీ టాక్ ఉంది. మెయిన్ గా అయితే కోలీవుడ్ హిస్టరీ లోనే భారీ నంబర్స్ ని ఈ చిత్రం రిజిస్టర్ చేసినట్టుగా తెలుస్తుంది. మరి యూఎస్ లో బిజినెస్ అయితే మరో రికార్డు నెంబర్ సెట్ చేసినట్టుగా తెలుస్తుంది. మరి యూఎస్ లో అయితే ఈ చిత్రం ఏకంగా 5 మిలియన్ డాలర్స్ బిజినెస్ ని లాక్ చేసినట్టుగా తెలుస్తుంది. దీనితో ఈ చిత్రం ఒక్క యూఎస్ నుంచే అన్ని వెర్షన్స్ లో 5 మిలియన్ డాలర్స్ దాటి వసూలు చేస్తే కానీ గట్టెక్కదని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి అనిరుద్ సంగీతం అందిస్తుండగా 7 స్క్రీన్ సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

మాస్టర్ కీ టీవీ ఛానల్
మీడియాలో స్వతంత్ర్య యజమానిగా హక్కులు తీసుకోవడానికి ఆహ్వానం
మీ వార్తకు మీరే యజమాని..!
ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో ఉన్న టీవీ ఛానెల్స్ అన్నీ.. మూడు పొలిటికల్ పార్టీలుగా విడిపోయి వారు ఆయా పార్టీలకు అనుకూలమైన వార్తలను ప్రసారం చేస్తూ ప్రజల సమస్యలను పట్టించుకోవటం లేదు.
ఈ దేశం బాగుండాలని కోరుకునే ప్రతి ఒక్కరి మనోభావాలను, సమస్యలను ప్రతీ రోజు మీరు పంపిన యెడల వాటిని మా ఛానెల్ ద్వారా ప్రసారం చేయబోతున్నాం.
ప్రతి పౌరుడికి మీడియా ద్వారా ఎంపవర్ చేయడమే మా ధ్యేయం. ఈ సాధికారత వల్ల ప్రజలు తమ సమస్యల పట్ల చైతన్యం కలిగి సమాజ శ్రేయస్సుకు చేయూతనివ్వగలుగుతారు.
ఇందుకు మీకు కలిగే లాభాలు :
1. సొంత సమస్యలు గాని, ప్రజా సమస్యలు గాని పరిష్కారం అయ్యే మార్గాలు.
2. నాయకునిగా ఎదిగే అవకాశం
3. మీ ద్వారా వచ్చే ప్రకటనలపై 50 - డిస్కౌంట్.
4. మీ పెట్టుబడి ఎక్కువ రేట్లు అయ్యే అవకాశం.
ఇందుకు మీరు చేయవలసిందల్లా వాటాదారునిగా చేరటమే.
మీరు మీ కుటుంబ సభ్యులందరూ కలిపి స్వతంత్ర్య యజమానిగా హక్కులు తీసుకోవడానికి రూ. 2 లక్షలు అంతకు మించిన విలువ చేసే వాటాలు తీసుకోవాలి.
మీకు కావాలంటే 2026 వ సంవత్సరం తర్వాత మీ వాటాలను మార్కెట్లో తిరిగి అమ్ముకునే అవకాశం ఉంటుంది.
ప్రస్తుతం కేబుల్ టీవీ ఛానెల్ గా ఉన్న మాస్టర్ కీ టీవీ త్వరలోనే శాటిలైట్ ఛానెల్ గా మారనుంది.
పతి ఒక్కరినీ భాగస్వామ్యులు కావాల్సిందిగా ఆహ్వానిస్తున్నాం.
రాజ్యాధికార సాధనకు MAMలో భాగమైన మీడియాను బలోపేతం చేద్దాం.
రండి..! కదలి రండి..!
వివరాలకై సంప్రదించండి...
91549 58315 - 76600 27683

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16. and SREE SESHASAI ENTERPRISES "D.NO : 3-88, "C/O CHANDRA THEATER," GOSALA VILLAGE, "MAIN ROAD, PENAMALURU MANDAL, KRISHNA DT, ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/ 25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com
PIN: 521151."MOBILE :9912333140 Email : sreeseshasaivja@gmail.com.